Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 219 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 29 ఆగష్టు 2023 | మంగళవారం | పేజీలు : 4

## భారత్‌తో వాణిజ్య ఒప్పందం.. వివాదంలో సునాక్

లండన్ : భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం ఖరారైతే దాని ద్వారా ఇన్ఫోసిస్ కంపెనీకి చేకూరే ప్రయోజనాలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని, ఒప్పందం విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని బ్రిటన్‌లోని ప్రతిపక్ష లేబర్ పార్టీ ఆ దేశ ప్రధాని రిషి సునాక్‌ను డిమాండ్ చేస్తోంది. సునాక్ భార్య అక్షతకు ఇన్ఫోసిసలో 500 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు ఉన్నాయి. అంతే కాకుండా, ఇన్ఫోసిసకు యూకేలో ప్రభుత్వ, ప్రైవేటు కాంట్రాక్టులున్నాయి. భారత్, బ్రిటన్ మధ్య వాణిజ్య ఒప్పందం తుది చర్చల దశలో ఉంది. చర్చల్లో సునాక్ పాల్గొంటున్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి ఆయన సెప్టెంబరులో ఇండియాకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో, వాణిజ్య ఒప్పందంలో ఇన్ఫోసిస్ కంపెనీకి అదనపు లబ్ధి చేకూరేలా నిబంధనలుండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కాంగ్రెస్-కామ్రేడ్ల స్నేహం!



## పొత్తుకు వామపక్షాలు సుముఖం

హైదరాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయ్! రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీల మధ్య స్నేహం చిగురిస్తోంది. అటు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ఇటు సీపీఐ, సీపీఎం జాతీయ నాయకత్వాల చొరవతో ఎన్నికల పొత్తుకు సానుకూల వాతావరణం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఎన్నికల పొత్తుకు సంబంధించి సీపీఐ నేతల అభిప్రాయం తీసుకునేందుకు ఓ మధ్యవర్తి ఆ పార్టీ నేతలను ఆహ్వానించారు. రహస్యంగా జరిగిన ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల పొత్తు ప్రతిపాదనపై కొంత సానుకూలత వ్యక్తం చేసిన వారు.. సీట్ల సర్దుబాట్ల విషయంలో సాగదీత తగదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ నిర్దిష్ట ప్రణాళికతో రావాలని.. ఒకటి, రెండు భేటీల్లో సీట్ల సర్దుబాటు విషయం తేలిపోవాలని చెప్పినట్లు తెలిసింది. తుదినిర్ణయమేదైనా.. సీపీఎం రాష్ట్ర నాయకత్వాన్ని కూడా సంప్రదించాకే ఉంటుందని వారు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సీపీఎం సైతం కాంగ్రెస్ పార్టీ నుంచి నిర్దిష్ట ప్రతిపాదన వచ్చినప్పుడే సీట్ల సర్దుబాట్లపై చర్చలు ప్రారంభించాలని భావిస్తోంది. ఇతర పార్టీలు కలిసి వచ్చినా.. రాకున్నా సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. తొలి జాబితాగా చెరో ఐదు సీట్లతో జాబితా ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నాయి. అయితే, కాంగ్రెసతో పొత్తు ప్రతిపాదన తెరపైకి రావడంతో ఒకటి రెండు రోజుల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నాయకత్వాలు సమావేశం కానున్నాయని.. ఆ భేటీ తర్వాతే దీనిపై మరింత స్పష్టత వస్తుందని సమాచారం.

**కేసీఆర్ ఏకపక్ష తీరు వల్లే..** రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఎన్నికల సర్దుబాటుకు సీపీఎం చాలా ఏళ్లుగా దూరంగానే ఉంటోంది. సీపీఐ మాత్రం 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెసతో కలిసే పోటీ చేసినా.. సీట్ల సర్దుబాట్లలో సాగదీత వల్ల ఆ పొత్తులు సానుకూల ఫలితాలను ఇవ్వలేదు. మునుగోడు ఉప ఎన్నికలో వామపక్షాల ఓట్లు కీలకంగా మారడంతో సీఎం కేసీఆర్ సీపీఐ, సీపీఎంల మద్దతును సంపాదించారు. రాష్ట్రంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల మనుగడకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కీలకంగా మారడంతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎసతో సీట్ల సర్దుబాట్ల కోసం ఆ పార్టీల నాయకత్వాలు చివరి వరకూ ఓపికగా ఎదురుచూశాయి. అయితే తాము కోరిన స్థానాల్లోనూ సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించడంతో వామపక్షాలు షాక్ అయ్యాయి.

## 'మధ్యవర్తి'తో సీపీఐ మంతనాలు - సీట్ల సర్దుబాటుపై స్పష్టతకు పట్టు

వాస్తవానికి ఇండియా కూటమిలో కాంగ్రెసతో కలిసి నడుస్తున్న వామపక్షాలు.. రాష్ట్రంలో మాత్రం బీఆర్ఎసతో కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. కేసీఆర్ ఏకపక్ష నిర్ణయంతో ఉభయ వామపక్ష పార్టీలూ మళ్లీ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

**సీట్ల సర్దుబాటు సమస్యే!** ఉభయ వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు పొత్తుపై ఒక అవగాహనకు రావాలంటే.. సీట్ల సర్దుబాటే సవాల్‌గా మారే అవకాశం ఉందంటున్నారు. సీఎం కేసీఆర్‌తో పొత్తు చర్చలు జరిగే ముందూ.. మునుగోడు, వైరా, కొత్తగూడెం, బెల్లంపల్లి, హుస్నాబాద్ స్థానాలను సీపీఐ.. భద్రాచలం, పాలేరు, మధిర, మిర్యాలగూడ, ఇబ్రహీంపట్నం స్థానాలను సీపీఎం అడిగిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ ముందూ రెండు పార్టీలూ ఇవే స్థానాలను ప్రతిపాదిస్తే.. సర్దుబాట్ల దగ్గరే చిక్కుముడి పడే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఎందుకంటే.. సీపీఐ అడుగుతున్న సీట్లలో మునుగోడు, కొత్తగూడెం సీట్లను 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. సీపీఎం అడుగుతున్న స్థానాల్లో భద్రాచలం, మధిర ప్రస్తుతం కాంగ్రెస్ సిటింగ్ సీట్లు. పాలేరు సీటునూ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు చర్చలు కాంగ్రెస్ నాయకత్వానికి, కామ్రేడ్‌లకూ సవాలేనంటున్నారు.




కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాది డిసెంబర్‌లో వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ఇప్పటికే ప్రచారం కోసం అన్ని హెలికాప్టర్లను కాషాయ పార్టీ ముందస్తుగా బుక్ చేసుకొందన్నారు. టీఎంసీ యువజన విభాగం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మాట్లాడిన ఆమె.. మూడోసారి భాజపా అధికారంలోకి వస్తే 'నిరంకుశ పాలనే'నని ఆరోపించారు. 'మూడోసారి భాజపా అధికారంలోకి వస్తే ఇక నిరంకుశ పాలనే. ఈ ఏడాది డిసెంబర్‌లోనే లోక్‌సభ ఎన్నికలకు భాజపా వెళ్లవచ్చని అంచనా వేస్తున్నా. ప్రచారం కోసం అవసరమైన అన్ని హెలికాప్టర్లను కాషాయ పార్టీ ఇప్పటికే ముందస్తుగా బుక్ చేసుకొంది. మరో పార్టీకి అవకాశం ఇవ్వొద్దనేది వారి ఆలోచన. పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం పాలనకు ముగింపు పలికాం. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను తప్పకుండా ఓడిస్తాం. ఇప్పటికే అన్ని వర్గాల్లో చీలిక తెచ్చే ప్రయత్నం భాజపా చేస్తోంది. మరోసారి అధికారం చేపడితే పరిస్థితులు దారుణంగా ఉంటాయి' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఇక అక్కడి గవర్నర్ తీరుపై మండిపడ్డ ఆమె.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వంతో సవాలుకు దిగవద్దని సూచించారు.. గవర్నర్ పదవి అంటే తనకు గౌరవం ఉన్నప్పటికీ.. ఆయన తీరు మాత్రం బాగాలేదన్నారు. ఇక ఇటీవల జాదవ్‌పూర్ యూనివర్సిటీలో చోటుచేసుకున్న వివాదంపైనా స్పందించిన మమతా.. 'గోలీ మారో' అంటూ నినాదాలు చేసిన వారిని అరెస్టు చేస్తామన్నారు.



## సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నామినేషన్లకు విరాళంగా పెన్షన్ డబ్బులు

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై తమకున్న ప్రేమను ముఖరా(కే) గ్రామస్తులు చాటుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ ఎన్నికల నామినేషన్లకు ముఖరా(కే) గ్రామస్తులు తమ పెన్షన్ డబ్బులను విరాళంగా ఇచ్చారు. గ్రామంలోని పెన్షన్‌దారులందరూ రూ. 1000 చొప్పున రూ. 1 లక్ష వరకు సేకరించి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ విరాళాన్ని 100 మంది పెన్షన్‌దారులు ఇచ్చారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారులు మాట్లాడుతూ.. తమకు కేసీఆర్ పించనే ఆసరా అని, తమకు పెద్ద కొడుకులా నెల నెల పించన్ ఇచ్చి మా బ్రతుకుకు భరోసాగా నిలుస్తుండని, మా వంతు కృషిగా కేసీఆర్, కేటీఆర్‌కు నామినేషన్ కోసం రూ. 1000 చొప్పున విరాళం ఇస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన ట్వీట్‌ను కేటీఆర్‌కు ట్యాగ్ చేయగా, ఆయన స్పందించారు. ఈ ట్వీట్‌ను కేటీఆర్ తన పేజీలో షేర్ చేస్తూ.. థాంక్యూ, రియల్లీ టచ్‌డ్ అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.




హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేత ఒకరు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని సమాచారం. నాగర్ కర్నూల్ ఎంపీ రాములు పార్టీ మారనున్నారని ప్రచారం జరుగుతోంది.

ఎంపీ రాములుతో ఇప్పటికే సునీల్ కనుగోలు టీమ్ టచ్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. రాములు అచ్చంపేట ఎమ్మెల్యే టికెట్ అడుగుతున్నట్టు సమాచారం. ఇది ఇచ్చేందుకు కాంగ్రెస్ అంగీకరిస్తే ఆయన పార్టీ మారడం ఫిక్స్ అవుతుందంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. కొద్ది నెలలుగా ఎంపీ రాములు బీఆర్ఎస్‌లో అసంతృప్తితో కొనసాగుతున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే టికెట్ అడుగుతున్నారు. అయితే ప్రస్తుతం అచ్చంపేట లో సిట్టింగ్ ఎమ్మెల్యే గా గువ్వల బాలరాజు ఉన్నారు. అచ్చంపేట అభ్యర్థి మార్పుపై ఇప్పటి వరకూ సీఎం కేసీఆర్ ఎలాంటి స్పష్టతనూ ఇవ్వలేదు. తనకు బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే టికెట్ రాదనే భావనలో ఎంపీ రాములు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో పార్టీ మార్పుపై హస్తం నేతలతో రహస్య మంతనాలు సాగిస్తున్నారు.




# టీబీజేపీ నేతలకు షా క్లాస్

## దిశానిర్దేశం చేసినట్లేనా!?

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ నేతలపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో జరిగిన మార్పులను ప్రస్తావించి ప్రస్తుత పరిస్థితుల పైన సీరియస్ అయ్యారు. ఎన్నికలవేళ ఇదే నా వ్యవహరించే తీరు అంటూ మండిపడ్డారు. పార్టీ నేతలకు రోడ్ మ్యాప్ డిసైడ్ చేశారు. ఖమ్మం వేదికగా బీజేపీ నిర్వహించిన రైతు గోస బీజేపీ భరోసా సభలో పాల్గొన్న కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్టీ వైఖరి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తో బీజేపీకి ఎటువంటి పొత్తులు ఉండవని తేల్చి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సభ తర్వాత పార్టీ కోర్ కమిటీ నేతలతో అమిత్ షా భేటీ అయ్యారు. తెలంగాణలో పార్టీ పరిస్థితులను ఆరా తీశారు. తన వద్దకు వచ్చిన నివేదికలను ప్రస్తావించారు. పార్టీలో సంస్థాగత మార్పులను ప్రస్తావించి తాజా పరిస్థితుల పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా నేతల మధ్య కొరవడిన సమన్వయం పైన షా ప్రశ్నలు సంధించారు.

ఎన్నికలు సమీపిస్తున్న వేళ సమన్వయం లేకుండా గ్రూపులుగా వ్యవహరించడం ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పరంగా బలంగా ఉన్న నేతలకు మద్దతు ఇవ్వాలని ఎన్నికల కోసం సమన్వయంతో పాటు వేగంగా వ్యూహాలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ షా దిశా నిర్దేశం చేశారు.ఎన్నికలు సమీపిస్తున్న వేళ నేతల తీరు ఏ మాత్రం ఆశాజనకంగా లేదంటూ క్లాస్ తీసుకున్నట్లు విశ్వాసనీయ సమాచారం. వేగం పెంచాలని వెంటనే ఎన్నికలు, మేనిఫెస్టో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ హై కమాండ్ నుంచి అన్ని రకాలుగా మద్దతు ఉంటుందని షా హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ గెలవడానికి చాలా అవకాశాలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలను ఆత్మరక్షణలో పడేసే ఏ అవకాశాన్ని వదులుకోవద్దంటూ అమిత్ షా స్పష్టం చేశారు. పార్టీ నేతలు కాన్ఫిడెన్స్, క్లారిటీ, కోఆర్డినేషన్,కమిట్మెంట్, క్రెడిబిలిటీ ఇలా C5 ఫార్ములాతో ముందుకు వెళ్లాలంటూ అమిత్ షా మార్గ నిర్దేశం చేశారు. పార్టీలో నేతలు ఎవరు ఏం చేస్తున్నారో తమ వద్ద పూర్తి సమాచారం ఉందని అన్ని వ్యవహారాలను పార్టీ గమనిస్తోందని వెల్లడించారు. త్వరలోనే మరోసారి తెలంగాణలో పర్యటనకు వస్తానని షా చెప్పినట్లు సమాచారం

గరుడ వార్త


# సంపాదకీయం

## ఇంతకూ చంద్రుడిపై ఉన్న వనరులపై హక్కు ఏ దేశానికి?

భూమికి దగ్గరగా కనిపించే ఉపగ్రహం చంద్రుడిపై మానవాళి ఆసక్తి ఇప్పటిది కాదు. భారతీయ పురాణాల్లో, జానపద కథల్లో చంద్రుడికి సంబంధించి చాలా కథలు, గాథలు ఉన్నాయి. అంతేకాకుండా భవిష్యత్తులో భూమికి ఎలాంటి విపత్తు అయినా సంభవిస్తే సురక్షిత గమ్యస్థానంగా చంద్రుడిని మార్చుకోవాలన్న ఆలోచనలు మానవాళికి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నో దేశాలు చంద్రుడి గుట్టుమట్లను తెలుసుకునేందు రాకెట్లను పంపాయి. అయితే ఇందులో నాలుగు దేశాలే ఇప్పటివరకు విజయం సాధించాయి. అమెరికా, రష్యా, చైనా, భారత్ మాత్రమే చంద్రుడిపైన ల్యాండర్ ను దించగలిగాయి. ఇక భారత్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ ను దించిన ఏకైక దేశంగా రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో చంద్రుడిపై అసలు ఏమున్నాయి? అనేది చర్చకు వస్తోంది. జాబిల్లిపై పెద్ద మొత్తంలో హీలియం, మంచు రూపంలో నీరు, సిలికాన్, అల్యూమినియం వంటివి కూడా పెద్ద మొత్తంలో ఉన్నాయని అంటున్నారు. మరి ఈ వనరులపై గుత్తాధిపత్యం ఎవరికి దక్కుతుంది? వీటి కోసమూ దేశాల మధ్య యుద్ధాలు తప్పవా అనేది ఆసక్తి రేపుతోంది. అయితే చందమామకు సంబంధించి అంతర్జాతీయ చట్టాలు స్పష్టంగా ఉన్నాయని చెబుతున్నారు. జాబిల్లి ఏ ఒక్కరిదో కాదని.. ఇది మొత్తం ప్రపంచ మానవాళికి చెందిందని అంటున్నారు. చంద్రుడిపై హిమం రూపంలో నీరు వంటి విలువైన వనరులు ఉన్నట్లు అంచనా. భారత్ ప్రయోగించిన చంద్రయాన్-1 చంద్రుడిపై నీటి జాడలను కనిపెట్టింది. జీవుల మనుగడకు నీరు అత్యంత ప్రధానమనే విషయం తెలిసిందే. కేవలం జీవుల మనుగడకే కాకుండా ఆక్సిజన్, తాగునీరు, హైడ్రోజన్ లాంటి రాకెట్ ఇంధనం వంటివి ఉత్పత్తి చేయడానికి కూడా వీలు కలుగుతుందని పేర్కొంటున్నారు. వీటితో సుస్థిర, చౌకైన పద్ధతిలో ఖగోళాన్వేషణలు చేసే వీలు కూడా ఉంటుందని చెబుతున్నారు. కాగా అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి 1966లో ఐక్యరాజ్యసమితి.. బాహ్య అంతరిక్ష ఒప్పందాన్ని తెచ్చింది. దీని ప్రకారం.. చందమామ, ఇతర ఖగోళ వస్తువులపై ఏ దేశమూ సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకోకూడదు. ఏ దేశం ప్రయోగాలు చేసినా అన్ని దేశాల ప్రయోజనం కోసమే ఖగోళ అన్వేషణలు ఉండాలి. అయితే ఈ ఒప్పందంలో కేవలం ప్రభుత్వాల ప్రస్తావనే ఉందని తెలుస్తోంది. చందమామలోని ఏదైనా ప్రాంతంపై హక్కులను ఆయా దేశాలు ప్రకటించుకోవచ్చా అనేదానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇక 1979లో మూన్ అగ్రిమెంట్ వచ్చింది. దీని ప్రకారం.. ఏ ప్రభుత్వం, అంతర్జాతీయ, ప్రభుత్వేతర సంస్థలు, వ్యక్తులు చందమామను తమ ఆస్తిగా ప్రకటించుకోవడానికి వీల్లేదు. అక్కడ కాలనీలు ఏర్పాటు చేసుకొని, జాబిల్లి మాదే అనడం కూడా కుదరదు. చంద్రుడితోపాటు దానిపైన ఉన్న సహజవనరులు కూడా మానవాళికి ఉమ్మడి సొత్తుగా ఉంటాయి. ఈ ఒప్పందం 1984లో అమల్లోకి రాగా చంద్రుడిపైకి ల్యాండర్లు పంపిన మూడు దేశాలు (ఇండియా మినహాయించి) అమెరికా, రష్యా, చైనా ఇంకా ఈ ఒప్పందాన్ని ఆమోదించకపోవడం గమనార్హం. అలాగే అంతరిక్ష ఒప్పందాలకు సంబంధించి అగ్రరాజ్యం అమెరికా 2020లో అర్టెమిస్ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. చందమామపై సురక్షితంగా ప్రయోగాలు చేపట్టడం దీని ప్రధాన లక్ష్యం. ఇందులో కెనడా, జపాన్, యూరోపియన్ యూనియన్ దేశాలతోపాటు తదితర దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. భారత్ కూడా ఇటీవల ఇందులో సభ్యురాలిగా చేరింది. మరోవైపు ఇప్పటికే చంద్రుడి ఉపరితలం నుంచి ఆక్సిజన్, ఇనుము, సిలికాన్, అల్యూమినియం వెలికితీసి, వాటి నుంచి సోలార్ సెల్స్, వైర్ ఉత్పత్తి చేయడానికి బ్లూ ఆరిజిన్ కంపెనీని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ.. నాసా ఎంపిక చేసింది. అదేవిధంగా జాబిల్లిపై శిలలను తొలగించడానికి, ఒదులుగా ఉండే చంద్రుడి మట్టిని గట్టిగా చేయడానికి, దాన్ని కరిగించి ఘన ఉపరితలంగా మార్చడానికి రెడ్ వైర్ అనే సంస్థకు నాసా బాధ్యతలు అప్పగించింది. వీటి సాయంతో ధూళికి తావులేని ప్రదేశాలను సిద్ధం చేస్తారు. అలాగే చంద్రుడిపై కట్టే ఇళ్లకు పునాదులు, రోడ్లు, ల్యాండింగ్ ప్యాడ్ లను కూడా సిద్ధం చేయవచ్చని చెబుతున్నారు. అలాగే చంద్రుడిపై ఫ్లుటోనియం ఆధారిత విద్యుదుత్పత్తి వ్యవస్థ కోసం వెలుపలి ఉష్ణోగ్రతలతో సంబంధం లేకుండా స్థిరంగా కొనసాగే రేడియో ఐసోటోపిక్ విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి జెనో పవర్ సిస్టమ్స్‌ను నాసా ఎంపిక చేసింది.




# యుగ పురుషుడు ఎన్టీఆర్

## ఎన్టీఆర్ నాణెం విడుదల... రాష్ట్రపతి కీలక వ్యాఖ్యలు!

దిల్లీ: తెలుగు ప్రజల అభిమాన నటుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రూ.100 స్మారక నాణేన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నందమూరి తారకరామారావు గురించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రూ.100 స్మారక నాణేన్ని రాష్ట్రపతి విడుదల చేశారు.

రాష్ట్రపతి భవన్ లోని సాంస్కృతిక కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం... భారతీయ సినిమా చరిత్రలో ఎన్టీఆర్ ఎంతో ప్రత్యేకమని.. రాజకీయాల్లోనూ ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. ఈ సందర్భంగా... రామాయణ మహాభారతాలకు సంబంధించిన అనేక పాత్రలలో ఎన్టీఆర్ జీవించారని.. మనుషులంతా ఒక్కటే అనే సందేశాన్ని తమ సినిమాల్లో ఇచ్చారని రాష్ట్రపతి తెలిపారు. ఇదే సమయంలో రాజకీయాలలో ఆయనకంటూ ఒక ప్రత్యేక స్థానం ఉందని ఆమె కొనియాడారు. అనంతరం ఎన్టీఆర్ కుమార్తె, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడారు. ఎన్టీఆర్ అంటే తెలియని వారు ఉండరని ఆమె చెప్పారు. మహిళకు ఆస్తిలో హక్కు కల్పించింది ఎన్టీఆర్ అని.. తిరుపతిలో మహిళా వర్సిటీ కూడా ఏర్పాటు చేశారని అన్నారు. యుగ పురుషుడుగా కీర్తించుకోదగ్గ ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని రాష్ట్రపతి కీర్తించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, సినీ, రాజకీయ రంగాల్లో ఆయనతో కలిసి పనిచేసిన సన్నిహితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణం రాజు మొదటివరుసలో ఆసీనులయ్యారు! కాగా... కృష్ణా జిల్లా నిమ్మకూరులో 1923 మే 28న ఎన్టీఆర్ జన్మించారు. స్వయం కృషితో సినీ, రాజకీయ రంగాలపై ఆయన చెరగని ముద్రవేశారు. ఈ సమయంలో ఆయన సమాజానికి అందించిన సేవలకు గుర్తుగా శత జయంతి సంవత్సరం సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ ప్రత్యేక రూ.100 నాణేన్ని ముద్రించింది. 44 మిల్లీమీటర్ల చుట్టుకొలతతో ఉండే ఈ నాణేన్ని 50% వెండి, 40% రాగి, 5% నికెల్, 5% జింక్ తో రూపొందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన 20 నిమిషాల నిడివి గల లఘుచిత్రాన్ని రాష్ట్రపతి ముందు ప్రదర్శించారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు.



## పెనుగోలు గోడు పట్టించుకునేదెవరు?



ములుగు : దశాబ్దాలు గడిచినా, ప్రభుత్వాలు మారినా పెనుగోలు గిరిజనుల కష్టాలు తీరడం లేదు. వాజేడు మండలంలోని అడవుల్లో పెనుగోలు గుట్టలపై నివసిస్తున్న ఆదివాసీల అవస్థలను పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు శూన్యం. నిత్యావసర సరకులు కొనుగోలు చేయాలంటే గుట్టలపై నుంచి 20 కి.మీ దూరం కాలినడకన రావాల్సిందే. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో దట్టమైన అటవీప్రాంతంలో ప్రస్తుతం 13 కుటుంబాలకు చెందిన 43 మంది నివాసముంటున్నారు. అటవీ ఉత్పత్తులను తయారు చేసి వాటిని అమ్ముకునేందుకు వాజేడులో ప్రతి బుధవారం జరిగే వారపు సంతకు వస్తుంటారు. వచ్చిన సొమ్ముతో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. ప్రతినెలా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం తీసుకోవాలన్నా వాగులు, వంకలు దాటి రావాల్సిన దుస్థితి.

కొండలు, వాగులు దాటుతూ ప్రయాస బాహ్యప్రపంచానికి దూరంగా నివసిస్తున్న పెనుగోలు గిరిజనులు మైదానప్రాంతానికి రావడానికి రోడ్డు సౌకర్యం లేదు. గుట్టలు, వాగులు దాటుతూ ప్రయాణించాల్సిందే. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగితే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అత్యవసర పనులకు ప్రాణాలను అరచేత పట్టుకుని వరదనీటిలో వస్తుంటారు. అత్యవసరంగా వైద్యం పొందాలంటే బాధితులను కావడిలో మోసుకురావాల్సిన పరిస్థితి. వర్షంలోనూ, వరదలోనూ ప్రతినెలా గ్రామాన్ని కేవలం వైద్యసహాయకుడు మాత్రమే సందర్శించి సేవలు అందిస్తుంటారు. గ్రామంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడిన సందర్భాలలో వైద్యాధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేస్తుంటారు.

### అధికారుల ప్రేక్షకపాత్ర

గుట్టలపైనున్నా ఆదివాసీలు ఇతరుల సాయం ఎన్నడూ ఆశించలేదు. కష్టాన్ని నమ్ముకుని బతుకుతున్న గిరిపుత్రులకు ఆదాయ వనరులు లేకపోయాయి. కూలిపనులు చేసుకునేందుకు కొండలపై వ్యవసాయ క్షేత్రాలు లేవు.

తిండి గింజల కోసం తాతముత్తాతల నుంచి వస్తున్న పట్టా భూములలో జొన్నలు, పప్పు దినుసులను సాగు చేసుకోవడమే తెలుసు. పూటగడవడమే కష్టంగా మారింది. ఆదుకోవాల్సిన పాలకులు, అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, సేవాగుణం కలిగిన దాతలు చేయూతనందించేందుకు స్పందించాలని స్వచ్ఛంద సేవకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తైబజార్ల నిర్వహణపై కొరవడిన దృష్టి

మిర్యాలగూడ : గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో తైబజార్ల నిర్వహణపై పాలకవర్గాలు, అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో వాటికి సమకూరాల్సిన ఆదాయం దక్కకుండా పోతోంది. ఆలేరు నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో 167 గ్రామ పంచాయతీలు, రెండు పురపాలికలు ఉన్నాయి. 11 గ్రామాలు, రెండు పురపాలికల్లో మూడు వారసంతలు నడుస్తున్నాయి. వీటిలో కేవలం రెండు వారసంతలు, రెండు పశువుల సంతకు సంబంధించి మాత్రమే తైబజార్ నిర్వహణ జరుగుతోంది.

### ఏటా ఐదుశాతం పెంపు..

తైబజార్, పశువుల సంత నిర్వహణకు ఏటా డీఎల్పీవోలు కనీస ధర నిర్ణయిస్తారు. సదరు గ్రామంలో వరుసగా మూడేళ్ల పాటు వివరాల ఆధారంగా కనీస ధరను ప్రకటిస్తారు. సాధారణంగా ఏటా ఐదుశాతం పెంచుతారు. ఈ ధర నుంచే వేలం పాట ప్రారంభమవుతుంది. నిర్వహణ అధికారం దక్కించుకున్న వారు గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధరల ప్రకారం వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేసుకోవాలి. చాలాచోట్ల తైబజార్ వేలం నిర్వహించని కారణంగా పంచాయతీల ఆదాయానికి గండి పడుతోంది. ఒకటి, రెండు చోట్ల వేలం ఖరారు కాగా గుత్తేదారులు నిర్ణీత ధరకంటే ఎక్కువ మొత్తాలను వసూలు చేస్తున్నారు.

### వాయిదాల్లో చెల్లింపులు

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం తైబజార్ల నిర్వహణ జరగాలి. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే గుత్తేదారులపై



చర్యలు తీసుకునే అధికారం పంచాయతీ కార్యదర్శులకు ఉంది. తైబజార్ దక్కించుకున్న వ్యక్తి వేలం పాటలో నాలుగో వంతు రుసుము వెంటనే చెల్లించాల్సి ఉంటుంది. మిగతా సొమ్మును 9 వాయిదాలలో చెల్లించాలి. ప్రతీనెల 5వ తేదీ వరకు నెలవారీ కిస్తులు చెల్లించాలి. ఈ మొత్తాలను పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమచేసి అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తారు.

పట్టింపు లేదు..వార, రోజు వారీ బస్టాండ్లు, పశువుల సంతల్లో తైబజార్ బోర్డులు ఏర్పాటు చేయాలి. పంచాయతీ తీర్మానించిన ధరల వివరాలు పొందుపర్చాలి. కానీ వీటిని ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. సంత జరిగే స్థలాలను శుభ్రం చేయించే బాధ్యత గుత్తేదారుదే. కానీ పట్టించుకోవడం లేదు. వేలం వేయడంతోనే బాధ్యత తీరినట్లు పంచాయతీలు వ్యవహరిస్తున్నాయి. గుత్తేదారులు నిబంధనల మేరకు డబ్బులు వసూలు చేస్తున్నారా, అధికంగా తీసుకుంటున్నారా, రశీదులు ఇస్తున్నారా.. అనే విషయాలపై అధికారులు దృష్టి సారించడం లేదు.

### ముందుకు రావడం లేదు- ఎం.డి.సలీం, ఎంపీవో, ఆలేరు

తైట్కుబజార్ నిర్వహణ హక్కుల వేలం పాటకు ఎవరూ ముందుకు రావడంలేదు. బిడ్ కనీసధర ఎక్కువగా ఉంటుందని, వేలం పాట దక్కించుకుంటే తమకు గిట్టుబాటు కావడంలేదని పేర్కొంటున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

## ఉపాధి పథకానికి ఆయిల్‌పామ్ అనుసంధానం

సూర్యాపేట : ఆయిల్‌పామ్‌కు అంతర్జాతీయంగా డిమాండ్ ఉండటంతో రాష్ట్రంలో పంట సాగు విస్తీర్ణం భారీగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాయితీలు కల్పించేందుకు ముందుకు వచ్చింది. మొక్కలు, బిందుసేద్యం పరికరాలపై రాయితీ ఇస్తున్నా.. గుంతలు తీయడం, మొక్కలు నాటడం, రవాణా తదితరాలకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో కర్షకులు ఈ పంట సాగుపై దృష్టిసారించడం లేదు. తాజాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఆయిల్‌పామ్ సాగును అనుసంధానించడంతో రైతులపై ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది.

### ఎకరాకు వ్యయం ఇలా..

ఆయిల్‌పామ్ మొక్కలు నాటేందుకు రెండు అడుగుల లోతు, వెడల్పుతో గుంతలు తీయాలి. గుంత తీసి మొక్కలు నాటేందుకు ఒక్కోదానికి రూ.100 ఖర్చు అవుతోంది. ఈ లెక్కన ఎకరానికి 50 గుంతలుంటే రూ.5 వేలు వెచ్చించాల్సి వస్తోంది. నర్సరీ నుంచి మొక్కల రవాణాకు సుమారు రూ.2,500, ఎరువులకు మరో రూ.రెండు వేలు ఖర్చవుతుంది. ఒక్కో మొక్క ధర రూ.193 కాగా, రాయితీ రూ.173 పోను రైతు వాటాగా రూ.20 చెల్లించాలి. ఈ లెక్కన మొక్కలకు రూ.వెయ్యి అవసరం. బిందుసేద్యం పరికరాలను రాయితీపై ఇస్తున్నా.. జీఎస్టీని రైతులే భరించాల్సి రావడంతో మరో రూ.5 వేలు, వాటిని బిగించేందుకు పంట పొలంలో తవ్వేందుకు మరో రూ.రెండు వేల చొప్పున చెల్లించాల్సి రావడంతో రైతులు ఆసక్తి చేపట్టడం లేదు. పైగా కొన్ని ప్రాంతాల్లో నాటిన మొక్కలను కోతుల పెకిలించేస్తుండటంతో మరికొంత మంది రైతులు వెనుకంజ వేస్తున్నారు. పంట సాగు చేసిన నాలుగేళ్ల వరకు ఎలాంటి ఆదాయం రాకపోవడంతో తక్కువ భూమి ఉన్న రైతులు జీవనోపాధికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతర పంటల సాగు అవకాశం ఉన్నా.. సాగు ప్రారంభంలోనే పెట్టుబడి ఎక్కువ అవుతోందని కర్షకులు చెబుతున్నారు.

### సాగు పెంచేందుకు కసరత్తు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం భారీగా పెంచాలని జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ సీజన్‌లో పది వేల ఎకరాల్లో సాగు చేయాలని ప్రణాళిక రూపొందించారు. మొక్కలు అందించేందుకు సూర్యాపేట జిల్లాలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు, బిందు సేద్యం పరికరాలు బిగించేందుకు తవ్వకాలు, మొక్కల రవాణా తదితర వాటికి ఎకరానికి రూ.20 వేలకు పైగా ఖర్చు అవుతోంది. ఈ ఖర్చులకు భయపడి రైతులు వెనకడుగు వేయకుండా ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ యాసంగిలో ఉపాధితో ఆయిమ్‌పామ్ అనుసంధానించి సాగును ప్రోత్సహించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

### జాబ్‌కార్డు ఉంటే అనుసంధానం- శ్రీధర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, సూర్యాపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆయిల్‌పామ్ సాగును చేర్చింది. జాబ్‌కార్డు ఉండి, ఆసక్తి గల రైతులుంటే ఉపాధి పథకంతో అనుసంధానించి గుంతలు, తదితర పనులను కూలీలతో చేయించాం. ప్రభుత్వ ఆదేశానుసారం ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తున్నాం.

# నవజాత శిశువులకు అపర సంజీవని

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య విషయంలో అప్రమత్తంగా ఉంటుంది. ఇప్పటికే మాతా, శిశు మరణాలు తగ్గించడానికి అనేక రకాల చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే గర్భిణులను సురక్షితంగా దవాఖానాకు తీసుకెళ్లడానికి 102 వాహనాలను ప్రవేశపెట్టింది. తాజాగా నవజాత శిశువులనూ రక్షించేందుకు ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. వీరి కోసం జిల్లాకు ఒక ప్రత్యేక అంబులెన్స్‌ను ప్రవేశపెట్టింది. ఆ వాహనం ప్రత్యేకతలపై 'న్యూస్‌టుడే' కథనం.

నవజాత శిశువులకు వ్యాధుల ముప్పు ఎక్కువ. అత్యవసర సమయంలో జిల్లా ఆసుపత్రి నుంచి హైదరాబాద్‌కు తరలించేలోగా నవజాత శిశువుల ఆరోగ్యం క్షీణించేది. ప్రభుత్వం శిశు మరణాలు తగ్గించడానికి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఒక్కొకటి చొప్పున నియోనటల్ అంబులెన్సులను కేటాయించింది. శిశువు అత్యవసరంలో వీటిలో పెద్దాసుపత్రికి తరలిస్తుంటారు. ప్రస్తుతమున్న




108 వాహనంలో ఆక్సిజన్ వెంటిలేటర్ సౌకర్యం ఉంటుంది. ఇందులో మాత్రం దాంతోపాటు అదనపు సిలిండర్ ఉంది. శిశువుకు ఏ సమస్య వచ్చినా ప్రథమ చికిత్స అందించేలా ఏర్పాటు చేశారు. నవజాత శిశువులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా టెక్నీషియన్స్ ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకునేలా వాష్‌బెసిన్ సౌకర్యమూ ఉంది.

సమస్య ఎదురైతే 108కి కాల్ చేయాలి

నవజాత శిశువులకు సమస్యలుంటే 108కి కాల్ చేయాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జన్మించిన శిశువులకు సమస్య ఉంటే కరీంనగర్ మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి తరలిస్తాం. ఎంసీహెచ్‌లో ఇబ్బంది ఎదురైతే ఇక్కడి నుంచి తల్లిదండ్రుల ఇష్టం మేరకు వరంగల్ ఎంజీఎం లేదా హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్తాం. సలీం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి

# దిగొచ్చిన సెస్.. రైతులకు ఊరట

వీర్నపల్లి: జిల్లా సరిహద్దులో ఉన్న ఉత్తర తెలంగాణ విద్యుత్తు సరఫరా సంస్థ (టీఎస్ఎన్‌పీడీసీఎల్)తో పోలిస్తే వ్యవసాయ కనెక్షన్ల విషయంలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్) పరిధిలోని రైతులు దోపిడీకి గురయ్యారు. సంస్థ ఆవిర్భావంలో ఉన్న పాత పద్ధతినే నేటికీ అమలు చేయడంతో అన్నదాతలు ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. దీనిపై ఏప్రిల్ 20న వ్యవసాయ కనెక్షన్ల విషయంలో సెస్ ఎట్టకేలకు దిగొచ్చింది. పాత పద్ధతిని ఎత్తివేసింది. దీంతో కొత్త కనెక్షన్లు పొందే కర్షకులకు ఊరట లభించనుంది.మెట్ట ప్రాంతమైన సిరిసిల్లలో కుటీర పరిశ్రమలకు అండగా, రైతన్నలకు చేయూతగా ఉండాలన్న సంకల్పంతో సెస్‌ను 53 ఏళ్ల క్రితం స్థాపించారు. మొదట్లో చిన్నగా మొదలైన సంఘం సేవలు ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విస్తరించాయి. జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 2,71,630 మంది వినియోగదారులకు సేవలందిస్తోంది. క్రమంగా వినియోగదారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కాగా ఉత్తర తెలంగాణ విద్యుత్తు సరఫరా సంస్థ ద్వారా కొనుగోలు చేసి పల్లెలకు కరెంటు అందిస్తుంది. సంఘం నిబంధనల ప్రకారం కొత్త కనెక్షన్లు తీసుకునే సభ్యులు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. గతంలో వ్యవసాయ కనెక్షన్లను పాత పద్ధతి ప్రకారం రైతులు నిర్దేశిత రుసుం చెల్లిస్తేనే మీటర్లు ఇచ్చేవారు. ఎన్‌పీడీసీఎల్‌తో పోలిస్తే సెస్ అధిక మొత్తంలో వసూలు చేసేది. ఫలితంగా అక్రమ కనెక్షన్లు పెరిగి సెస్ తీవ్రంగా నష్టపోతుంది. పాలకవర్గం సభ్యులు మహాసభలో పాత పద్ధతిని రద్దు చేస్తూ తీర్మానం చేశారు. ఎన్‌పీడీసీఎల్ మాదిరిగా కనెక్షన్లు ఇస్తుండటంతో కొత్తగా కనెక్షన్లు తీసుకునే రైతులకు లబ్ధి చేకూరుతుంది.

నిఘా అవసరం...

పాత పద్ధతిలో అన్నదాతలు వ్యవసాయ కనెక్షన్లు తీసుకునేందుకు మొగ్గు చూపలేదు. దీంతో సెస్ పరిధిలో అక్రమ కనెక్షన్లు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా నియంత్రికలు కొద్ది రోజులకే మరమ్మతులకు గురవుతున్నాయి. ఉప కేంద్రాల పరిధిలోని ఫీడర్లపై లోడు ప్రభావం పడుతోంది. పాత పద్ధతిని ఎత్తివేయడంతో అన్నదాతలు కనెక్షన్లు తీసుకునేందుకు అవకాశం ఉంది. వినియోగదారుల సంఖ్య పెరిగి సంఘం బలోపేతం అవుతుంది. అనుమతి లేని కనెక్షన్ల విషయంలో సిబ్బంది ఉదాసీనత సెస్‌కు నష్టం చేస్తుంది. ఇటువంటి రైతులను గుర్తించి అవగాహన కల్పించాలి. అనుమతి లేని వ్యక్తులను వినియోగదారులుగా మారిస్తే మరింత ప్రయోజనం చేకూరనుంది.

రాయితీ ఇలా...

గతంలో సెస్ పరిధిలో ఒక వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ పొందాలంటే రైతు సామాజికవర్గం ఆధారంగా డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. స్తంభం లేకుంటే ఓ రేటు, స్తంభాలు పెరిగినా కొద్దీ ఎక్కువ మొత్తంలో రుసుం చెల్లించాల్సి ఉండేది. పాత పద్ధతి ఎత్తివేయడంతో ఎన్‌పీడీసీఎల్ మాదిరిగా రైతులకు కనెక్షన్లు సెస్ ఇవ్వనుంది. మూడు స్తంభాల వరకు రూ. 6,097 (5 హెచ్‌పీ), నాలుగు పైగా స్తంభాలు అవసరమైతే అధికారులు క్షేత్ర స్థాయిలో అంచనాలు సిద్ధం చేస్తారు. మూడు స్తంభాల వరకు రాయితీని వర్తింపజేసి మిగతా స్తంభాలకు లెక్క కడతారు. అలాగే నియంత్రికలు అవసరమైతే నియంత్రిక పరిధిలోని ఒక్కో రైతుకు రూ. 75 వేల వరకు రాయితీ అందనుంది. ఎనిమిది రోజుల క్రితమే దీనికి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేశారు. ప్రస్తుతం కనెక్షన్ తీసుకొనే రైతులకు ఇది వర్తిస్తుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయ కనెక్షన్ల విషయంలో గతంలో ఉన్న పద్ధతిని ఎత్తి వేశాం. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి రాయితీతో కూడిన కనెక్షన్లు ఇస్తున్నాం. ఎనిమిది రోజుల నుంచి కొత్త విధానం అమలవుతుంది. అన్నదాతలు అనుమతి లేని వాటిని వాడకూడదు. దర్జాగా కొత్త వాటిని పొంది సంఘం బలోపేతానికి సహకరించాలి. అధికారులతో పల్లెల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అక్రమ కనెక్షన్లను తొలగిస్తాం.చిక్కాల రామారావు, సెస్ ఛైర్మన్

# చూడ చక్కని పంట.. ప్రతి నీటి చుక్కకు లెక్క!



వరంగల్ : 'అంతా ఎడారి ప్రాంతం. చుట్టూ సముద్రం తప్ప మంచి నీరు ఉండని కరవు సీమ. దేశ భూభాగంలో సాగుకు అనువైన నేల 20 శాతమే. అయినా అక్కడి రైతులు బంగారం పండిస్తున్నారు. లాభాలు ఆర్జిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే ఇజ్రాయెల్.' ఇజ్రాయెల్‌లో వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసేందుకు ఇటీవల రాష్ట్రం నుంచి ఒక బృందం వెళ్లింది. అందులో హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు ఎల్లావుల లలితయాదవ్, ఇర్రి రమణారెడ్డి, భుక్యా బాలాజీనాయక్‌లు ఉన్నారు. ఆరు రోజుల పాటు అక్కడ ఉండి వ్యవసాయ విధానాలను పరిశీలించారు. సాగులో వినియోగించే సాంకేతికత, యాజమాన్య పద్ధతులు, వనరుల వినియోగం, ఎగుమతులు, మార్కెటింగ్.. ఇలా ప్రతి అంశంలో మన దగ్గరితో పోలిస్తే అక్కడ అవలంభిస్తున్న విధానాలను గమనించారు. అక్కడి సాగు విధానాలు వారి మాటల్లోనే..

అనేక అడ్డంకులున్నా అద్భుతాలు ఎల్లావుల లలితయాదవ్, హనుమకొండ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షురాలు

ఇజ్రాయెల్ రైతులను చూస్తే ఆశ్చర్యం కలిగింది. మన దగ్గర పుష్కలంగా నీరు ఉన్నా వేసవి వస్తే పంటలు ఎండిపోతుంటాయి. అక్కడ అలా కాదు. తీవ్రమైన నీటి కొరత. మనుషులు స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగించే నీటిని శుద్ధి చేసి పంటలకు వినియోగిస్తున్నారు. పంట క్షేత్రాల వద్ద నీటి మీటర్లు, సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రతి రైతు అవసరం మేరకే వాడుకోవాలి. ప్రతీ చుక్కకు పక్కాగా లెక్క ఉంటుంది. వాడుకున్న నీటికి ప్రభుత్వానికి బిల్లు కట్టాలి. మేం వెళ్లిన ప్రాంతం గాజా సరిహద్దు. అక్కడ తరచూ బాంబులు వేస్తుంటారని, యుద్ధం జరిగే ముందు ఒక సైరన్ రాగానే పంట క్షేత్రాల్లోని బంకర్లలో దాక్కుంటామని రైతులు చెప్పారు. ఇలా ఎన్నో ప్రతికూలతలు ఉన్నా రైతులు అద్భుతంగా పంటలు పండిస్తున్నారు. ఎండ బాగా ఉండడం వల్ల పాలీ హౌజ్‌లలో, డ్రిప్, స్ప్రింక్లర్ సేద్యం చేస్తున్నారు. కూలీల కొరత ఉండడం వల్ల పక్కన మరో దేశం నుంచి కూలీలు వస్తారు. వారికి బీమా చేయాల్సిన బాధ్యత రైతులదే.

మన దగ్గర నిమ్మ జాతి పంటలు మూడు నాలుగు మాత్రమే పండిస్తాం. అక్కడ 18 రకాల సిట్రస్ జాతి పండ్లను పండిస్తూ ఐరోపాకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

పంటల వైవిధ్యానికి ఆ ప్రాంతం పెట్టింది పేరు. పుచ్చ పండు మన దగ్గర ఎర్రవి పండితే అక్కడ పచ్చవి, తెల్లవి కూడా సాగు చేస్తున్నారు. మనం సాగు చేసే మామిడి, దానిమ్మ, అరటి, ఉల్లి, ద్రాక్ష లాంటి పంటల్ని ఎంతో నాణ్యతగా పండిస్తున్నారు. మొత్తం సాగు వ్యయంలో రైతులకు 30 శాతం వరకు మిగులుతోంది. మన దగ్గర ప్రభుత్వం రాయితీ ఇస్తూ సాగునీరు, విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నా మన రైతన్నలు ఆశించినంత లాభాలు ఆర్జించలేకపోతున్నారు.

వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా చేస్తున్నారు

ఇర్రి రమణారెడ్డి, జనగామ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు

రైతులు సహకార విధానంలో సమష్టిగా సాగు చేసుకుంటున్నారు. మన దగ్గరిలా కాకుండా అక్కడి రైతులు దీన్నో పరిశ్రమలా చేయడం వల్ల లాభాలు గడిస్తున్నారు. మన దగ్గర ఒక రైతు వరి వేస్తే పక్కనున్న మడిలో పత్తి సాగు చేస్తారు. అక్కడ కలిసికట్టుగా ఒకే పంటను వందల ఎకరాల్లో సాగు చేయడం, తర్వాత లాభాలు వచ్చాక కలిసికట్టుగా పంచుకోవడం వారికి కలిసొస్తోంది. వర్షం చాలా తక్కువ. మనతో పోలిస్తే పదిశాతం కూడా ఉండదు. అయినా సరైన యాజమాన్య పద్ధతులు పాటించి కర్షకులు అద్భుతాలు సాధిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను సమర్థంగా వాడుకుంటున్నారు. విత్తు వేయడం నుంచి పంటను కోసే వరకు యాంత్రీకరణ వల్ల నాణ్యత పాటించగలుగుతున్నారు.

మేం చూసిన తోటల్లో ఒక్కో దానిమ్మ అరకిలో నుంచి కిలో వరకు తూగుతోంది. ఇలాంటివి మన దగ్గర చూడలేదు. రైతులు పంటలు పండించాక ఎవరికి వారు అమ్ముకోకుండా నేరుగా ఒకే దగ్గరికి తీసుకెళ్లి గ్రేడింగ్ చేసేసి, దాన్నో బ్రాండ్‌గా విక్రయిస్తారు. దీని వల్ల మార్కెటింగ్ ఇబ్బందులు ఉండవని అర్థమైంది.

సేంద్రియానికి జై కొడుతున్నారు

భుక్యా బాలాజీ నాయక్, మహబూబాబాద్ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు

ఇజ్రాయెల్ సాగును చూశాక మన దగ్గర ఇన్ని వనరులున్నా సరైన విధానాలు పాటించడం లేదని అర్థమైంది. నీటిని మూడు దశల్లో శుద్ధి చేసి సాగుకు వాడుతున్నారు. మన దగ్గర పుష్కలంగా ఉన్నా సద్వినియోగం చేసుకోవడం లేదనిపించింది. అక్కడి రైతులు సాగు కోసం వాడుకుంటున్న ప్రతి వనరుకు డబ్బులు చెల్లించాల్సిందే. నీరు, విద్యుత్తు, భూమి ఇలా సాగు వ్యయం భారీగానే అవుతోంది. భూమంతా ప్రభుత్వానిదే. కొన్నేళ్లపాటు రైతులు లీజుకు తీసుకోవాలి. సమష్టిగా సాగు చేయడం వల్ల మధ్యాహ్నం భోజనాలు అంతా కలిసే చేస్తారు. వారి పిల్లలు అక్కడే పాఠశాలల్లో చదువుతారు. వారు రాత్రి వరకు పంటక్షేత్రం వద్దే ఉంటారు.

రసాయన ఎరువుల వాడకం తక్కువగా ఉంది. మేం వెళ్లిన ఒక పంట క్షేత్రంలో ఆకులు అలముల చెత్తను అలాగే వదిలేశారు. అది కంపోస్ట్‌గా పనిచేస్తుందని అక్కడి రైతులు చెప్పారు. సేంద్రియ ఎరువులను వేస్తూనే నాణ్యమైన పంటల్ని పండిస్తున్నారు.

ఎక్కువగా పండ్లు, కూరగాయలు సాగు చేస్తున్నారు. ఖరీదైన పంటల్ని పండించడం వల్ల ఎగుమతికి వీలవుతోంది. ఆలివ్ ఆయిల్, అవకోడా, క్యాబేజ్, క్యారెట్, అల్బుకార్.. ఇలా చాలా రకాలు కనిపించాయి. పంట క్షేత్రాలకు అనుసంధానంగా శీతల గిడ్డంగులు ఉన్నాయి.

# గిర్మాజీపేటలో సమస్యల తిష్ఠ



వరంగల్ : వరంగల్ గిర్మాజీపేటలో సమస్యలతో స్థానికులు సతమతం అవుతున్నారు. గత ఏప్రిల్‌లో గిర్మాజీపేటలోని పలు కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం రూ. 4.7 కోట్లు మంజూరు అయ్యాయి. చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఐదు నెలలు పూర్తయినా కనీసం 50శాతం పనులు కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కూరగాయల మార్కెట్ రోడ్డు నుంచి సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వరకు రోడ్డు మధ్యలో కంకర పోసి వదిలివేయడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీల నిర్మాణం, మిషన్ భగీరథ పైపులైనుల కోసమని సుమారు ఆరు నెలల క్రితం పలుచోట్ల రోడ్లను తవ్వేశారు. పనులు చేపట్టకపోవడంతో రోడ్లపై మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. పైపులు పగిలి తాగునీరు వృథాగా పోతోంది.

నోరుతెరుచుకున్న డ్రైనేజీ: వరంగల్ బస్టాండు ఆవరణలో మూడు రోడ్లను కలిపేచోట డ్రైనేజీపై ఎలాంటి రక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. లక్ష్మీపురం నుంచి బస్టాండువైపు వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపులోనూ రోడ్డుకు, డ్రైనేజీ పైపులకు అనుసంధానంగా మట్టి నింపకపోవడంతో ప్రమాదం పొంచిఉంది.

16 ఏళ్లుగా సీసీరోడ్లు, డ్రైనేజీలు లేవు..: గ్రేటర్ వరంగల్ 27వ డివిజన్ పరిధిలోని ఎల్బీఆర్ నగర్‌లో 16 ఏళ్ల నుంచి సుమారు 220 కుటుంబాలు నివశిస్తున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపైనే నిలుస్తోంది. ఇళ్లకు విద్యుత్తు మీటర్లు కూడా లేవు. ఒకే మీటర్ నుంచి అందరూ కనెక్షన్ తీసుకోవడంతో యూనిట్లు పెరిగి స్లాబ్‌రేట్ మారి నెలనెలా రూ.వేలల్లో బిల్లు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపట్టాలని, ఇంటింటికి విద్యుత్తు మీటర్లు అమర్చాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలే సమస్య

స్థానిక ప్రజాప్రతినిధుల అండతో కొందరు డ్రైనేజీలను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేశారు. దీంతో వర్షాలకు వరద నీటితో పాటు మురుగు ఇళ్లలోకి చేరుతోంది. కొన్నిచోట్ల రోడ్లను కూడా ఆక్రమించి ఇళ్లను నిర్మించారు. రూ.కోట్ల నిధులతో చేపట్టిన పనులు అసంపూర్తిగా వదిలేశారు. రోడ్డు మధ్యలో కంకర కుప్పలు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

# ఆగని 'భద్రకాళి' ఆక్రమణలు

వరంగల్ : భద్రకాళి చెరువు స్థలాల ఆక్రమణలు ఆగడం లేదు. చెరువు విస్తీర్ణం తగ్గడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలు కాలనీలను వరద ముంచెత్తిన విషయం విధితమే. ఇవేమీ పట్టించుకోకుండా కొందరు అక్రమార్కులు హనుమకొండ పద్మాక్షిగుట్ట రోడ్డులో భద్రకాళి చెరువు లోపలి వైపు పదుల సంఖ్యలో టిప్పర్లతో మట్టి తెచ్చి పోశారు. గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ అధికారు లకు సమాచారమిచ్చినా స్పందించ లేదని స్థానికులు విమర్శించారు. సామాజిక కార్యకర్త చీకటి రాజు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆమె ఆదేశం మేరకు మధ్యాహ్నం సాగునీటి పారుదలశాఖ అధికారులు వెళ్లి పరిశీలించారు. నర్సింగ్ కళాశాల వైపు మట్టి నింపిన స్థలాన్ని పరిశీలించి, రెవెన్యూ శాఖాధికారులతో మాట్లాడారు.

హద్దులు తేల్చక పోవడంతో..: భద్రకాళి చెరువు ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న భవన నిర్మాణాలపై ఇప్పటికే రాష్ట్ర వినియోగదారుల మండలి ప్రతినిధులు చెన్నైలోని జాతీయ హరిత



ట్రైబ్యునల్(ఎన్జీటీ)లో ఫిర్యాదు చేశారు. ఇంత జరుగుతున్నా హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారులు భద్రకాళి చెరువు హద్దులు ఖరారు చేయడం లేదు. చెరువు స్థలాలపై స్పష్టత లేకపోవడంతో ప్రైవేటు పట్టా భూములంటూ కొందరు ఆక్రమణలకు యత్నిస్తున్నారు. కాపువాడ, రంగంపేట, పోతననగర్ వరకు చెరువు కట్ట హద్దులుండగా.. హంటర్‌రోడ్ నుంచి పద్మాక్షిగుట్ట రోడ్డు వైపు లేవు.

# దాచెయ్.. దోచెయ్!

జయశంకర్ : జిల్లాలో ఇసుక మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మానేరు వాగు నుంచి అధికంగా ఇసుకను తరలిస్తూ లక్షలాది రూపాయలను వెనకేసుకుంటున్నారు. వాగుల నుంచి ఇసుకను తోడి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా డంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా జిల్లాలోని టేకుమట్ల మండలం కలికోట, చిట్యాల మండల కాల్వపల్లితోపాటు మల్హర్, కాటారం మండలాల్లోని పలు గ్రామాల్లో సైతం ఈ దందా జోరుగా సాగుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడంతో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

అనుమతులు లేకుండా డంపులు

ఎండాకాలంలో ఇసుకను ఎప్పటికప్పుడు వాగుల నుంచి తరలించిన ఇసుక మాఫియా వర్షాకాలం మొదలు కావడంతో డంపులపై దృష్టిపెట్టింది. వర్షాలు పడి వాగులు ప్రవహిస్తే ఇసుక కొరత ఏర్పడే పరిస్థితి ఉండడంతో ముందస్తుగా తరలించి గ్రామ శివారుల్లోని ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. వాగుల్లో వరద తగ్గినప్పుడు వీలు చిక్కినప్పుడల్లా ఇసుక తవ్వకాలు చేపట్టి నిల్వ చేస్తున్నారు. చిట్యాల మండలం కాల్వపల్లి, టేకుమట్ల మండలం కలికోట, కాటారం మండలం విలాసాగర్, తదితర గ్రామ శివారుల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు దర్శనమిస్తున్నాయి. పొక్లెయిన్లతో ఇసుకను తోడుతూ ట్రాక్టర్ల సహాయంతో ఆయా గ్రామాల్లో డంపు చేస్తున్నారు. చిట్యాల మండలం



కాల్వపల్లిలో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్వారీలో తవ్వకాలు చేపట్టడం లేదు. దీంతో ఇసుకకు డిమాండ్ ఉండటంతో ఇసుకాసురులు ఇష్టారీతిన విక్రయాలు జరుపుతున్నారు.

లారీల్లో తరలిస్తూ..కలికోట, కాల్వపల్లి మానేరువాగు నుంచి ఇసుకను తీసి రాత్రి వేళలో ఆయా గ్రామాల నుంచి లారీల్లో, ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ లోడుకు రూ. 50 వేల వరకు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్ల ద్వారా చిట్యాల మండల్లాలోని గ్రామాల వారికైతే రూ.5 వేలు, రేగొండ, భూపాలపల్లి మండలాల వారికైతే రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆయా డంపులను ఇటీవల పోలీసు అధికారులు వెళ్లి ఆరా తీసినట్లు సమాచారం. కొందరు పెద్దల హస్తం ఉందని తెలియడంతో వెనుదిరిగినట్లు తెలిసింది. గతంలో స్థానికంగా ట్రాక్టర్ ఇసుక రూ. వెయ్యి నుంచి రూ.2 వేల వరకే లభించేది. ఇప్పుడు సామాన్యులు కొనే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి ఇసుక అక్రమాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విచారణ చేపడతాం

రమాదేవి, ఆర్డీఓ, భూపాలపల్లి

అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇసుక డంపులు, తవ్వకాల విషయమై ఆయా ప్రాంతాల తహసీల్దార్లతో విచారణ చేయిస్తాం. ఇసుక తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటాం.

# ఇంటర్‌లో ఆంగ్ల భాషపై ప్రయోగ పరీక్షలు

జమ్మికుంట: ఈరోజుల్లో ఆంగ్ల భాష వినియోగం అన్ని రంగాల్లోనూ విస్తరించింది. పాఠశాల స్థాయి నుంచి ఉద్యోగాలు సాధించే దాకా ఆంగ్లంపై అవగాహన ఉండాల్సిందే. ప్రభుత్వ పథకాల లబ్ధి నుంచి ప్రతి రంగంలో ఆంగ్లంలో దరఖాస్తులు పూరించాల్సిందే. ఇంగ్లీషులో పట్టు ఉంటేనే సులువుగా కొలువులు సాధించవచ్చనే ధీమా అభ్యర్థుల్లో ఉంది. స్పోకెన్ ఇంగ్లీషు చూసి, నేడు ఉద్యోగాలు ఇస్తున్న వారున్నారు. ఆంగ్లానికి ఉన్న ప్రాధాన్యంతో ఇంటర్ ప్రథమ విద్యార్థుల ప్రయోగ పరీక్షల్లో బోర్డు

మార్పులు చేసింది. ఇప్పటిదాక సైన్స్‌లో పలు శాస్త్రలకే పరిమితమైన ప్రయోగపరీక్ష ఇప్పుడు ఆంగ్ల పాఠ్యాంశానికి తప్పనిసరి చేశారు. దీనితో ఇంటర్ ప్రథమ విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు అవకాశం ఏర్పడింది. విద్యార్థులకు ప్రయోగ పరీక్షల పుస్తకాలను అందజేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఏడాది నుంచి ఇంగ్లీషులో ప్రయోగ పరీక్షలను తప్పనిసరి చేయగా, విద్యార్థులకు అధ్యాపకులు అవగాహన కల్పిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్లంపై పట్టు సాధించేలా అధ్యాపకులు దృష్టి సారించారు. ఇంగ్లీషులో సంభాషణలు, వ్యాకరణం తదితర అంశాలను ప్రొజెక్టర్ల ద్వారా విద్యార్థులకు డాక్యుమెంటరీ రూపంలో అవగాహన కల్పించనున్నారు. తరగతిగదిలో విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా చర్యలు తీసుకోనున్నారు. వీటికి కూడ విద్యార్థులకు మార్కులు కేటాయించనున్నారు. దీంతో ఆంగ్లంపై విద్యార్థులకు భయం పోతుందని అధ్యాపకులు అంటున్నారు.

ఐదు విభాగాలకు 20 మార్కులు

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో విద్యార్థులకు 5 విభాగాల్లో ఒక్కో విభాగానికి నాలుగు మార్కుల వంతున కేటాయించారు. ఇందులో రికార్డు రాయడంతో పాటు నాలుగు విభాగాల్లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. విద్యార్థులకు అంశాల వారీగా టాపిక్ ఇచ్చి సంభాషణ, మౌఖిక, తదితర అంశాలపై ప్రయోగ పరీక్ష నిర్వహిస్తారు.

భయం పోతుంది

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆంగ్ల భాషపై ప్రయోగ పరీక్షలు నిర్వహించడంతో భాషపై పట్టు సాధిస్తారు. భయం కూడ పోతుంది. తరగతి గదిలో బోధన, ఇద్దరి మధ్య సంభాషణలు, ప్రశ్నలకు సమాధానం తదితర అంశాలతో పాటు ఉచ్చారణలో తప్పిదాలు లేకుండా విద్యార్థులు ఆంగ్లంలో పట్టు సాధిస్తారు.

శ్రీధర్, అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట

మంచి పరిణామం

ఇంటర్ ప్రథమ విద్యార్థులకు ఆంగ్ల భాషపై ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం మంచి పరిణామం. ఇంటర్ బోర్డు ఆదేశాలతో ఆంగ్లంలో బోధన, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన వివరాలు విద్యార్థులకు కళాశాలల్లో అవగాహన కల్పిస్తారు.

# గండం దాటితేనే గమ్యం

జయశంకర్ : భద్రాచలం నియోజకవర్గం పరిధిలో కీలకమైన ఆర్అండ్‌బీ రహదారి ఛిద్రమైంది. ములుగు-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లోని ఎదిర గుట్టల మూలమలుపులో కల్వర్టు కుంగింది. ఈ పరిధిలో రవాణా చేసేందుకు ప్రయాణింకులకు ఈ కల్వర్టు గండంగా మారింది. ఆ ముప్పు దాటితేనే గమ్యం చేరుకునే పరిస్థితి ఉదయించింది. తరచూ ఈ ప్రాంతంలో వాహనాలు కూరుకుపోయి రాకపోకలు స్తంభించడం నిత్యకృత్యంగా ఉంది. తాజాగా మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ దిగబడటంతో బుధవారం ఉదయం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ పరిస్థితి తరచూ తలెత్తుతున్నా ఆర్అండ్‌బీశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగంలో నిస్తేజం నెలకొంది.

పది గంటలకు పైగా ట్రాఫిక్ స్తంభన

ఎదిరగుట్టల మూలమలుపు కల్వర్టుపై ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ దిగబడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రాచలం నుంచి వెంకటాపురానికి ప్రయాణికులతో వస్తున్న రాత్రి బస చేసే బస్సు



ఇక్కడ ధ్వంసమైన కల్వర్టు ప్రాంతంలో కూరుకుపోయింది. సుమారు 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బయటికి తీసేందుకు డ్రైవర్ ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో పలువురు ప్రయాణికులు ఆటోలో స్వస్థలాలకు చేరుకున్నారు. అదే మార్గంలో వచ్చిన ఇసుక లారీ సైతం పక్కనే దిగబడింది. దీంతో ఈ రోడ్డులో ట్రాఫిక్ పూర్తిగా నిలిచింది. బుధవారం ఉదయం 8 గంటల వరకు రాకపోకలు నిలిచిపోవాల్సి వచ్చింది.

దారికి వచ్చేది ఎప్పుడో!

వాజేడు, వెంకటాపురం మండలాల్లో విస్తరించి ఉన్న భద్రాచలం-చంద్రుపట్ల మార్గం ఆధునికీకరణ పనులు నత్తే నవ్వుకునేలా ఉన్నాయి. జగన్నాథపురం వై.జంక్షన్ నుంచి ఎదిరగుట్టల వరకు ఈ మార్గంగా బాగు చేసేందుకు సుమారు రూ.23.80 కోట్లను కేటాయించారు. కొంతమేరకు పనులు చేసినా ప్రమాణాలు పాటించకపోవడంతో మళ్లీ పాతకథే మొదలైంది. వెంకటాపురం నుంచి ఎదిరగుట్టల వరకు ఇంకనూ మరమ్మతు పనులు పూర్తి కాలేదు. ఈ మార్గంలో అడుగడుగునా పెద్ద ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

రాత్రంతా జాగరం: కళ్లెం చంద్రయ్య, ఆర్టీసీ డ్రైవర్

భద్రాచలం డిపో నుంచి వెంకటాపురానికి ప్రయాణికులతో బయలుదేరిన తాము రాత్రి 11 గంటలకు గమ్యానికి చేరుకోవాలి. ఎదిరగుట్టల ప్రాంతంలో ఛిద్రమైన కల్వర్టు ప్రాంతంలోని బురదలో బస్సు దిగబడింది. ఎంత ప్రయత్నించినా బయటికి రాలేదు. దీంతో రాత్రంతా జాగారం చేశాం. అభయారణ్యం ప్రాంతంలో భయంభయంగానే గడిపాం. తరచూ ఇక్కడ సమస్య తలెత్తుతోంది.

ప్రయాణమంటేనే భయం: మస్తాన్, ప్రయాణికుడు

ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే ఒళ్లు హూనమవుతోంది. వాహనాలు ఎక్కడ నిలిచిపోతాయో అనే భయం పట్టుకుంది. ఇంత అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే గుంతల ప్రాంతంలో సీట్ల నుంచి పైకి ఎగరాల్సి వస్తోంది. వరంగల్ వెళ్లేందుకు బయలు దేరా. రోడ్డుకు అడ్డుగా వాహనాలు కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభించి సమయం వృథా అయింది.

# రోగులకు ఆరోగ్య ఖాతా

హుజూర్‌నగర్: ఏరియా ఆసుపత్రుల్లో సాంకేతికత ఉపయోగించుకొని కార్పొరేట్ ఆసుపత్రుల పద్ధతులను సామాన్య రోగులకు కూడా అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. ఒక రోగి ఏరియా ఆసుపత్రికి వచ్చినప్పుడు ఆధార్‌కార్డుతో నమోదు చేయించుకుంటే వారిని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా(ఆభా) కింద నమోదు చేస్తారు. ఇలా చేసిన వారి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయి. ఏ ఆసుపత్రికి వెళ్లినా ఆభా నంబరు చెబితే దాని ఆధారంగా వారి ఆరోగ్య వివరాలు అన్నీ తెలుసుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఆభా నంబరు ఆధారంగా వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని దానికి అనుగుణంగా చికిత్స అందిస్తారు. ప్రయోగాత్మకంగా..కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా (ఆభా) రాష్ట్ర వ్యాప్తంగా 102 ఏరియా ఆసుపత్రుల్లో రెండు నెలల నుంచి అమలు చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను ఒత్తిడికి గురిచేయకుండా వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆధార్‌కార్డు తీసుకొని ఆభా కింద నమోదు చేయించుకోవాలని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా చేస్తున్న కార్యక్రమం కావడం వల్ల కొన్ని ఆసుపత్రులలోనే ప్రవేశపెట్టారు. సూర్యాపేటలోని మెడికల్ కళాశాల ఆసుపత్రిలో,



హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రుల్లో అమలు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రులలో ఆభా కింద రోగుల వివరాలు నమోదు చేస్తున్నారు. మరోసారి వచ్చినప్పుడు ఈ నంబరు చెబితే దాంతో రోగి ఫైలు తెరిచి రెండోసారి ఆసుపత్రికి వచ్చిన వివరాలు నమోదు చేస్తారు. ఇలా ఎన్నిసార్లు ఆసుపత్రికి వస్తే అన్ని సార్లు నమోదవుతుంది. దీంతో రోగి ఆరోగ్య వివరాలు ఆసుపత్రిలో నిక్షిప్తమై ఉంటాయి. అత్యవసర వైద్య సేవలకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు ఆసుపత్రి వారికి ఆభా నంబరు చెబితే ఆ రోగి వివరాలు అందుబాటులోకి వస్తాయి. ఒకవేళ ఆభా నంబరు చెప్పలేకపోయినా ఆధార్ ఆభా కింద నమోదయి ఉంటే ఆ రోగి ఆరోగ్య వివరాలు తెలుసుకోవచ్చు. జాప్యం లేకుండా నాణ్యమైన చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. ప్రయోగాత్మకంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో మార్పులు చేర్పులు ఉంటే చేసి వీటిని అన్ని ఆసుపత్రులలకు అమలు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాంకరణ్‌కుమార్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, హుజూర్‌నగర్ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా కింద ఓపీ నమోదు చేసుకునేం దుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. ఆసుపత్రికి వచ్చే రోగులకు వివరాలు చెప్పి ఆధార్‌కార్డుతో నమోదు చేయించేందుకు కృషి జరుగుతోంది. రెండు నెలల్లో దాదాపు 300 ఖాతాలు తెరిచాం. చాలా మంది ఆధార్‌కార్డు లేకుండా ఆసుపత్రికి రావడం వల్ల అందరివి నమోదు చేయించలేకపోతున్నాం ఆభాపై అవగాహన కల్పిస్తున్నాం.

# పొలాలు అమ్మి... లాభాలు ఇస్తాడని నమ్మి...



ఖమ్మం : ఆన్‌లైన్ షాపింగ్ వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేసి మోసగించిన వ్యవహారంలో కీలక సూత్రధారి లీలలు ఒక్కొక్కటి బయటకొస్తున్నాయి. లాభాలు వస్తాయన్న ఆశతో తెలుగు రాష్ట్రాల్లోని పలువురు భారీగా డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ మోసంలో సూత్రధారి ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలానికి చెందిన వ్యక్తి కావడంతో చుట్టుపక్కల మండలాల్లోని పలువురు ఆస్తులు అమ్మి మరీ డబ్బులు సమకూర్చారు. కొందరైతే బంధువుల వద్ద అప్పులు తీసుకుని మరీ ఇచ్చారు. ఐటీఐలో చేరి మధ్యలో మానేసిన ప్రధాన సూత్రధారి జి.కొండూరు మండలం గంగినేనిలో తొలుత ఎరువుల వ్యాపారం చేసి, నష్టాలు రావడంతో ఐపీ పెట్టాడు. పదేళ్ల క్రితం మద్యం సిండికేట్‌లో చేరి, భాగస్వాములను భారీగా మోసగించారన్న ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆన్‌లైన్ షాపింగ్ వ్యాపారం ప్రారంభించిన రెండున్నరేళ్లలోనే ఇంత భారీ స్థాయిలో అప్పులు చేసి జనాలకు కుచ్చుటోపీ పెట్టడం కలకలం రేపుతోంది.

600 మంది.. రూ.2వేల కోట్లు...

రూ.2వేల కోట్లకు పైగా వసూలుచేసి మోసగించిన వ్యవహారంలో బాధితుల సంఖ్య చాంతాడంత ఉంటుందని భావిస్తున్నారు. అప్పులు ఇచ్చినవారు 600 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలకు చెందిన ఓ మహిళ తన రెండు ఎకరాల పొలాన్ని ఎకరా రూ.కోటి చొప్పున కంపెనీలో భాగస్వామిగా ఉన్న వ్యక్తి కుమార్తె పేరిట నెల క్రితం రిజిస్ట్రేషన్ చేశారు. నగదును ఆమెకు ఇవ్వకుండానే కంపెనీలో పెట్టుబడులు పెట్టామని నిర్వాహకులు నమ్మబలికారు. అందుకు ఆమెకు భారీ మొత్తంలో వడ్డీ ముట్టజెబుతామని చెప్పారు. నిజమేనని నమ్మిన మహిళ అందుకు అంగీకరించింది. మూడు రోజుల నుంచి కంపెనీ బోర్డు తిప్పేశారని ప్రచారం జరగడంతో లబోదిబోమంటున్నారు.

ఏపీ, తెలంగాణలో గోదాముల ఏర్పాటు

2021 మే 3న.. హైదరాబాద్‌లోని ఆర్వోసీ (రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్) వద్ద రూ.4.9కోట్ల షేర్ కేపిటల్, రూ.4.37 కోట్ల పెయిడ్ అప్ కేపిటల్‌తో కంపెనీని నమోదు చేశారు. హైదరాబాద్‌లోని శేర్‌లింగంపల్లి మండలం నానక్‌రామ్‌గూడ చిరునామాగా పేర్కొన్నారు. వ్యాపారంలో భాగంగా ఏపీ, తెలంగాణలోని విజయవాడ, హైదరాబాద్, ఖమ్మం, గొల్లపూడి, దుగ్గిరాలపాడు, మైలవరం, గంగినేని, తదితర ప్రాంతాల్లో గోదాములు అద్దెకు తీసుకున్నాడు. ప్రజల వద్ద నుంచి పెట్టుబడులు పెట్టించారు. ఒక్కో గోదాములో 20 మంది కార్మికుల చొప్పున దాదాపు 300 మంది వరకు పనిచేస్తున్నారు. కంపెనీలో భాగస్వాములుగా ఉన్న వ్యక్తులు రోజుకో ఖరీదైన కారులో వచ్చి ప్రజల నుంచి నగదు వసూలు చేశారు. మలేషియా, బ్యాంకాక్ తదితర ప్రాంతాల్లో జల్సా జీవితాలు గడిపి ఫొటోలు దిగి వాటిని చూపించి మళ్లీ పెట్టుబడి పెట్టేలా నమ్మించారు. చిన్న గుమాస్తాలుగా పనిచేసే వారి నుంచి కూడా రూ.50వేల నుంచి రూ.10లక్షల వరకూ నగదు వసూలు చేశారు. ఇప్పటివరకు ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదని తెలిసింది.

# చకచకా పనులు.. జోరందుకున్న చేరికలు



ఖమ్మం : వైద్య విద్యార్థులకు తరగతులు బోధించేందుకు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఈ కళాశాలను మంజూరు చేసింది. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.166 కోట్లు కేటాయించింది. తొలుత రూ.11.05 కోట్లు విడుదల చేసింది. పాత కలెక్టరేట్ భవనంలో అందుకు అవసరమైన ఆధునికీకరణ పనులు చకచకా సాగుతున్నాయి. 2023-24 విద్యాసం వత్సరంలో ఎంబీబీఎస్ తొలి ఏడాది బోధనకు సరిపడా సదుపాయాలు ఇప్పటికే 90 శాతం సమకూరాయి. నెలరోజుల్లో పూర్తిస్థాయిలో కళాశాల అందుబాటులోకి రానుంది. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తైన వెంటనే విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు.

త్వరలో వంతెన నిర్మాణం..

30 ఎకరాల విస్తీర్ణంలోని పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బీ, డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రాంగణాలను వైద్య కళాశాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. రూ.8 కోట్లతో ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కళాశాలలో దాదాపు 21 విభాగాలను ఏర్పాటు చేస్తారు. మొదటి బ్యాచ్‌కు ఈ ఏడాదికి సరిపడా అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ విభాగాలను పాత కలెక్టరేట్ వెనక భాగంలో నెలకొల్పారు. అడ్మిన్‌బ్లాక్, లైబ్రరీ, రెండు లెక్చర్‌హాళ్లు, మూడు డెమోస్టేషన్లు, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మాలజీ, ప్రివెంటివ్ మెడిసిన్, క్యాంటీన్ గదులను సిద్ధం చేశారు. ఆర్అండ్‌బీ భవనాన్ని బాలికలు.. డీఎంహెచ్‌ఓ కార్యాలయం పైఅంతస్తును బాలుర వసతిగృహాలుగా ఆధునికీకరిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. కౌన్సెలింగ్ ముగిసేలోగా విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. క్లినికల్ బోధన నిమిత్తం విద్యార్థులు, అధ్యాపకులు రాకపోకలు సాగించేలా కళాశాల ప్రాంగణాన్ని సర్వజనాసుపత్రికి అనుసంధానిస్తూ రూ.3.25కోట్లతో కాలినడక వంతెన నిర్మించనున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి ఈ ఏడాదే వంతెనను అందుబాటులోకి తీసుకురానున్నారు.

మానవ వనరుల కల్పనపై..

నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు మానవ వనరుల కల్పనపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) దృష్టి సారించారు. ఇప్పటికే కళాశాలకు ఏడుగురు ప్రొఫెసర్లు, 23 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు వచ్చారు. మరో 30 మంది సీనియర్ రెసిడెంట్స్ రానున్నారు. బోధనేతర సిబ్బందిలో ఏఓ, నలుగురు ఆఫీస్ సబార్డినేట్లు, అటెండర్, ఇద్దరేసి చొప్పున జూనియర్ అసిస్టెంట్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఫార్మసిస్టులు విధుల్లో చేరారు. మరో 32 పోస్టుల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన టెక్నీషియన్లు, ఇతర విభాగాలకు చెందిన స్టాఫ్‌ను నియమించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

ఇప్పటివరకు 24 మంది చేరిక

ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం బ్యాచ్‌లో 100 సీట్లు ఉండగా.. నేషనల్ కోటా కింద 15 సీట్లు కేటాయించారు. దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా నీట్‌లో అర్హత సాధిస్తే ఈ కళాశాలలో చేరవచ్చు. రెండు రోజుల క్రితం వరకు ఇద్దరు మాత్రమే ప్రవేశాలు పొందగా.. నేషనల్ కోటా కింద ఇప్పటివరకు ఎనిమిది మంది చేరారు. రాష్ట్ర కోటాలో 16 మంది ప్రవేశాలు పొందారు.

విశాల ప్రాంగణంలో ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నాం. ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు సదుపాయాలు సమకూర్చుతున్నాం. నాణ్యమైన బోధన అందించేందుకు ఫ్యాకల్టీ అందుబాటులో ఉన్నారు. విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించేలా వసతిగృహాలను రూపొందించాం. డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల

# లీకేజీల ముప్పు.. కలగదా కనువిప్పు

ఖమ్మం :కొత్తగూడెం పురపాలికలో రైల్వే అండర్ బ్రిడ్జి, పాత బస్ డిపో, గణేశ్ టెంపుల్, భజన మందిరం, రామవరం తదితర ప్రాంతాల్లో కిన్నెరసాని పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. రేగళ్ల నుంచి ఇల్లెందు అడ్డరోడ్డు వరకు ప్రధాన పైపులైన్‌దీ ఇదే పరిస్థితి. ప్రధాన పైపులైన్లకు కొందరు కన్నం వేయడంతో నీరు వృథా అవుతోంది. ఏటా కిన్నెరసాని పైపుల మరమ్మతుల పేరిట రూ.5 లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం నెరవేరట్లేదు. పాత పైపులైన్లు కావడంతో లీకేజీల సమస్య శాశ్వత పరిష్కారానికి నోచుకోవటం లేదు. ఇల్లెందు పట్టణంలో అంతర్గత రహదారికి ఆనుకుని ఉన్న ఈ పైపులైన్ తరచూ లీకవుతోంది. లీకైన పైపుల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. కొన్నిసార్లు రంగుమారిన నీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ కాలనీల్లోనూ తాగునీటి పైపులు లీకవుతున్నాయి.

సత్తుపల్లి పురపాలికలో ఫుట్‌పాత్‌కు ఆనుకుని ఉన్న ఈ పైపులైన్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. లీకైన పైపుల్లోకి మట్టి, చెత్తాచెదారం వెళ్తుండటంతో నీరు కలుషితమవుతోంది. పట్టణంలోని చాలా వార్డుల్లో పాత పైపులైన్ వ్యవస్థ ఉండటంతో ఇదే పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంలో తాగునీటి పైపులైన్ అనేకసార్లు లీకవుతోంది. మొదట ఒక్కచోటే లీకైనా వాహనాల తాకిడికి పైపులైన్ భారీగా దెబ్బతింటోంది. నగరంలో చాలాచోట్ల ఇలాంటి దుస్థితి దాపురించింది. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు సరిపెడుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

అసలే వర్షాకాలం.. వ్యాధులు ప్రబలే తరుణం.. తాగునీటి పైపులైన్ల లీకేజీలే ఇందుకు కారణం.. మరమ్మతుల పేరిట రోడ్లను తవ్వి వదిలేయటం, వాహనాల రాకపోకలతో పైపులు పగిలిపోవటం బల్దియాల్లో పరిపాటిగా మారింది. అయినా అధికారులు శాశ్వత పరిష్కారం చూపటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

తీర్మానాలకే పరిమితమా..

ఖమ్మం నగరపాలిక, వైరా, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ పురపాలికల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలు నిత్యకృత్యం. అనేకచోట్ల 20 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు కావడంతో తరచూ లీకవుతున్నాయి. అభివృద్ధి పనుల పేరిట రహదారులను ఇష్టారాజ్యంగా తవ్వుతుండటమూ మరో కారణం. రోజుల తరబడి తాగునీరు వృథా అవటం ఒక ఎత్తైతే.. లీకైన పైపుల ద్వారా కలుషిత జలాలు సరఫరా కావడం మరో ఎత్తు. పైపులైన్ల లీకేజీల మరమ్మతులకు వేసవిలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పాలకవర్గ సమావేశాల్లో తీర్మానిస్తారు. చాలాసార్లు లీకేజీలపై చర్చిస్తారు. అయినా వర్షాకాలంలో సమస్య పునరావృతమవుతూనే ఉంది. ప్రధాన రహదారులు, కాలనీల్లో పైపులు పగిలి రోజుల తరపడి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. పైపులైన్ల లీకేజీలపై ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరించకపోవటం, వార్డులు, డివిజన్ల వారీగా నీటి సరఫరా విభాగాన్ని పర్యవేక్షించకపోవటం, లీకేజీల నివారణకు ప్రత్యేక యంత్రాంగం కొరవడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులకు విచ్చలవిడిగా ఖర్చు..!

బల్దియాల్లో పైపులైన్ల లీకేజీలకు ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని పురపాలికల్లో నెల వ్యవధిలోనే సుమారు పదిసార్లు మరమ్మతులు చేస్తున్నట్లు అధికారులు ప్రస్తావిస్తున్నారు. ఖర్చుకు తగ్గట్టు సమస్య పరిష్కారం కావటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

కొత్తగూడెం పురపాలికలో లీకేజీల సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.130 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే కిన్నెరసాని పైపులైన్ వ్యవస్థను మార్చి కొత్తది ఏర్పాటుచేస్తాం. ప్రస్తుతానికి పైపులైన్లు లీకవుతున్నచోట మరమ్మతులు చేపడుతున్నాం. జి.రఘు, పుర కమిషనర్, కొత్తగూడెం

# రూపు మారనున్న పెద్దపల్లి రైల్వే స్టేషన్

కరీంనగర్: రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులను మెరుగుపరచడం, పరిసరాల సుందరీకరణ, ప్రణాళికయుతమైన పార్కింగ్, ఇతర వసతులను కల్పించేందుకు రైల్వే శాఖ చేపట్టిన అమృత్ భారత్ పనులు పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని రామగుండం, కరీంనగర్‌లో అమృత్ భారత్ పనులను ఇటీవల ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించగా.. పెద్దపల్లి, మంచిర్యాలలో అనధికారికంగానే పనులు మొదలయ్యాయి. పెద్దపల్లిలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

జంక్షన్ విస్తరణకు అవకాశాలు..

అమృత్ భారత్ కింద చేపట్టే పనులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూపకల్పన చేశారు. పెద్దపల్లి రైల్వే జంక్షన్ విస్తరణకు ఈ పనులు మరింత తోడ్పాటునిచ్చే అవకాశముంది. ప్రస్తుత స్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలోని పెద్దబొంకూర్, చీకురాయి సరిహద్దు సమీపంలో పెద్దపల్లి టౌన్ (కరీంనగర్ వెళ్లే రైళ్లకు బైపాస్) స్టేషన్ మంజూరి కావడంతో ఈ స్టేషన్ అభివృద్ధికి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుత రైల్వే స్టేషన్‌లోని నాలుగు ప్లాట్ ఫాంలలో ఒక్కటి మినహా మూడు ప్లాట్ ఫాంల పొడవును మరింత పెంచనున్నారు. ప్రస్తుత స్టేషన్ భవనం విస్తరించి, ప్రవేశ మార్గంలో ప్రత్యేక ఆర్చి నిర్మించి,




స్టేషన్ ముందు ప్రాంతాన్ని సుందరంగా తీర్చదిద్దనున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించడంతో పాటు ఆటోలు, ఇతర అద్దె వాహనాలను స్టేషన్ ఆవరణలోకి రానివ్వకుండా పరిసరాల్లో పచ్చదనంతో పాటు రోడ్లను అందంగా నిర్మిస్తారు.

మౌలిక వసతులకే ప్రాధాన్యం

స్టేషన్ అభివృద్ధిలో రైల్వేశాఖ ప్రయాణికులకు మౌలిక వసతులను కల్పించడానికే అధిక ప్రాధాన్యం కల్పించింది. ప్లాట్ ఫాంలపై ఇరువైపులా శౌచాలయాలు నిర్మిస్తారు. ప్రస్తుతమున్న కాలినడక పైవంతెనకు అదనంగా ఎస్కలేటర్, లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. లిఫ్టుకు సంబంధించిన సివిల్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. దీనికి సంబంధించిన నమూనా చిత్రాలను అధికారులు బుధవారం పెద్దపల్లిలో విడుదల చేశారు. ఒకటో ప్లాట్‌ఫాంపై ప్రస్తుతమున్న మొదటి, జనరల్ తరగతి వెయిటింగ్ హాల్‌ను విస్తరించి, అదనంగా ఏసీ వెయిటింగ్ హాల్‌ను నిర్మిస్తారు. ప్రస్తుతమున్న ఆటో టికెట్ టెల్లింగ్ మిషిన్‌కు అదనంగా మరొకటి ఏర్పాటు చేయనున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఆధునికీకరించడంతో పాటు ప్రస్తుతమున్న హాల్‌ను విస్తరిస్తారు.

# ఆమె తలచుకుంటే అందలమే..!

భువనగిరి : రానున్న శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని సింహభాగం నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఆయా అభ్యర్థుల గెలుపోటములను అతివలే నిర్ణయించ నున్నారు. ఇటీవల ఓటరు ముసాయిదా జాబితాను అధికారులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా మొత్తం 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు స్థానాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. అందులో నకిరేకల్ నియోజకవర్గంలో 171 పురుష ఓటర్లు స్వల్ప ఆధిక్యంలో ఉండగా, భువనగిరి నియోజకవర్గంలో 649 మంది మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లు కొద్ది ఆధిక్యంలో ఉండటం విశేషం. మొత్తం మీద 27,46,402 ఓటర్లుండగా.. 13,78,452 మహిళాఓటర్లు, 13,67,795 పురుష ఓటర్లు, 155 మంది ఇతరులున్నారు. అన్ని నియోజకవర్గాలకు కలిపి కేవలం 10,657 మాత్రమే పురుష ఓటర్లు ఆధిక్యంలో ఉండటం గమనార్హం. గత ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాల్లో అభ్యర్థుల విజయంలో అతివల ఓట్లే కీలకంగా మారిన విషయం విధితమే.



మార్పులు, చేర్పులకు మరో అవకాశం..

తాజాగా ప్రకటించిన ఓటరు ముసాయిదా జాబితాపై సెప్టెంబరు 19 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. కాగా ఈ ప్రక్రియలో ఇంకా ఏమైనా పొరపాట్లు ఉంటే అక్టోబరు 2న పరిశీలిస్తారు. నూతనంగా నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఈ నెల 26, 27, వచ్చే నెల 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

సంబంధిత దరఖాస్తు పత్రాలు ఇవీ..

ఫారం-8 : కొత్తగా నమోదు చేసుకునేందుకు

ఫారం-6ఏ : విదేశాల్లో ఉన్న భారతీయుల ఓటు నమోదుకు..

ఫారం-6బి : ఓటుకు ఆధార్ అనుసంధానం కోసం..

ఫారం-7 : వివిధ కారణాలు చూపిస్తూ జాబితా నుంచి పేరు తొలగించేందుకు

ఫారం-8 : ఓటరు కార్డులో పేరు, చిరునామా, వివిధ మార్పులకు

# ఉమ్మడి జిల్లాలో 11 వేల మంది

కరీంనగర్: బీడీ కార్మికుల జీవితాలకు మేలు చేసే విధంగా ఇప్పటికే కార్మికులకు పింఛన్ అందుతుండగా.. కొత్తగా టేకేదారులకు, ప్యాకర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా భృతిని అందించాలనే నిర్ణయం ఉమ్మడి జిల్లాలోని ఈ వర్గాలకు మేలు చేయనుంది.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం మెదక్‌లో రూ.2016 పింఛన్ అందజేయడం కార్మిక లోకానికి సంతోషాన్ని కలిగిస్తోంది.. ఒకట్రెండు రోజుల్లో జిల్లాలకు అందే మార్గదర్శకాల ప్రకారం ఈ దిశగా అడుగులు పడనున్నాయి.ఏళ్ల తరబడి వినతులు..ఉత్తర తెలంగాణలో నిజామాబాద్ జిల్లా తరువాత ఎక్కువగా బీడీ కార్మికులున్న జిల్లాగా ఉమ్మడి కరీంనగర్‌కు పేరుంది. ఇక్కడ చాలా కుటుంబాల్లోని మహిళలు బీడీలు చుడుతూ దినసరి ఆదాయాన్ని అందుకుంటున్నారు. వీరితోపాటు టేకేదార్లు, ప్యాకింగ్ చేసే వారు తమ సంక్షేమాన్ని పట్టించుకోవాలని కొన్నేళ్లుగా వినతులు అందిస్తూ వచ్చారు.

# మిరప రైతు దిగాలు

ఖమ్మం : ప్రధాన వాణిజ్య పంట అయిన మిరప సాగుకు ఉమ్మడి జిల్లా ప్రసిద్ధి. రాష్ట్రంలోనే ఎక్కువ సాగయ్యే జిల్లాల్లో ఇదొకటి. వరుసగా రెండో ఏట కూడా మిరప రైతుల కంట కన్నీరు తప్పడం లేదు. తెగుళ్లు, వైరస్‌లతో ఈ సీజన్‌లో దిగుబడులు ఊహించిన దానికంటే ఎక్కువ పడిపోతున్నాయి. సాధారణ అంచనాతో పోల్చితే సగం కంటే ఇంకా తక్కువ వస్తుండటం ఆందోళనకర అంశం. ఇక కౌలు రైతుల పరిస్థితి చెప్పలేనట్లుగా మారింది. ఫలితంగా చాలాచోట్ల మొదటి కోత కాగానే మిరప పైరు తీసేసి ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్నారు. ప్రస్తుతం ఇలా..జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మిరప దిగుబడులు చేతికొచ్చాయి. కొన్నిచోట్ల రెండోసారి కాయలు కోత పూర్తి కావొస్తుంది. ఒక్కోచోట ఒక్కో మాదిరిగా కోతల పురోగతి ఉంది. చాలా ప్రాంతాల్లో మొదటి దఫాలో దీలాపడి మిరప మొక్కలు పీకేసి పెసర, మొక్కజొన్న సాగును పూనుకుంటున్నారు. వైరా, కొణిజర్ల, తల్లాడ, కల్లూరు, ఏన్కూరు, చింతకాని, మధిర, ఎర్రుపాలెం, జూలూరుపాడు, అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, పాల్వంచ, ఇల్లెందు, టేకులపల్లి



వంటిచోట్ల ఇప్పటికే రైతులు దిగుబడి రాక ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. సాధారణంగా ఎకరానికి 30 క్వింటాళ్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం సగంకంటే తక్కువ వస్తున్నాయి. పైరు బాగా ఉంటే మొదటి కోతలో 15 క్వింటాళ్లు దిగుబడి ఉంటుంది. మొదటి, రెండో దఫా కలిపి ఏడెనిమిది క్వింటాళ్లే కష్టతరంగా వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. సింహభాగం రెండు కోతల్లో పది క్వింటాళ్లు రాని పరిస్థితులున్నాయి. మొదటి కోత అనంతరమే చాలాచోట్ల మొక్కలు ఈడు బారినట్లు కనిపిస్తున్నాయి. ఎకరానికి పెట్టిన రూ.లక్షన్నర పెట్టుబడి ఎలా వచ్చేదని మథన పడుతున్నారు. ఏటా మార్చి ఆఖరు వరకు ఉండాల్సిన తోటలు ఈసారి ముందుగానే కనుమరుగవుతున్నాయి.ధర దోబూచులాటగతేడాది క్వింటా రూ.22 వేల దాకా చేరటంతో రైతులు ఈ సీజన్‌లో అధికంగా సాగు చేశారు. నష్టాల నుంచి బయటపడొచ్చన్న ధైర్యంతో ముందుకెళ్లినా వైరస్‌ల తాకిడితో దెబ్బతిన్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.18,200 వరకు ఉండగా మార్కెట్లో మాత్రం రూ.3 నుంచి రూ.4 వేలు తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేదనే సాకు చూపుతున్నారు. అప్పులైనా తీరుద్దామని కొందరు విక్రయిస్తుండగా ఇంకొందరు విక్రయించాలా లేక శీతల గిడ్డంగుల్లో పెట్టాలా అని ఆలోచిస్తున్నారు. ధర ఇంకా తగ్గుతుందా అనే ఆందోళన నెలకొంది.

ఈ సీజన్లో వేరుకుళ్లు, తామర పురుగు, గుబ్బ వైరస్ తీవ్రంగా నష్టపరిచింది.కౌలు రైతులకు పెట్టుబడులకు అదనంగా ఎకరాకు రూ.20 వేల కౌలు, నీటి వసతి లేనిచోట బోర్ల కోసం రూ.10 వేలు వెచ్చించారు.మిరప కోతలకు కిలోకు రూ.పది వరకు చెల్లించారు.

గతేడాది కంటే ఈసారి ఎకరానికి పెట్టుబడి రూ.20 నుంచి రూ.30 వేలు పెరిగింది.

సాగు విస్తీర్ణం ఎకరాల్లో..

ఖమ్మం: 69,900

భద్రాద్రి: 26,500

నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకున్నా. ఎకరానికి పది క్వింటాళ్లలోపు మాత్రమే వచ్చింది. కౌలు, నీటి వసతి కాకుండా రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టాను. వేరుకుళ్లు, తామర, గుబ్బ వైరస్‌లు తీవ్రంగా నష్టపరిచాయి. పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు.దాసరి రామారావు, మల్లారం కౌలు రైతు

మూడెకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగు చేశా. వైరస్‌తో పూర్తిగా ఎండిపోయింది. ఎకరానికి రూ.18 వేలు కౌలు చెల్లించా. ఎకరానికి ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పెట్టుబడులూ రాలేదు. దీంతో మిరప తీసేసి పెసర చల్లాను.నల్లగొండ రామారావు, తల్లాడ

# శిక్షణ.. అందని ద్రాక్షేనా..?

ఖమ్మం : ప్రస్తుతం సంభవిస్తున్న మరణాల్లో అధిక భాగం రోడ్డు ప్రమాదాల్లోనే జరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. మద్యం తాగి అతివేగంగా నడపడం ఓ కారణమైతే, సరైన శిక్షణ లేకుండా రోడ్లపై వాహనాలను నడపడం ప్రమాదాలకు దారితీస్తోంది. కారు, ఇతర భారీ వాహనాల డ్రైవింగ్‌లో మెలకువలు నేర్చుకొని నడిపితే రహదారి ప్రమాదాలను నియంత్రించవచ్చనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవింగ్ శిక్షణ పరికరం(సిమ్యులేటర్) అందుబాటులోకి తీసుకొచ్చాయి. నిర్వహణ బాధ్యతలను అప్పగించిన మారుతీ సుజుకీ సంస్థకు చెందిన మిత్రా ఆటో ఏజెన్సీస్ శిక్షణకు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. రెండున్నరేళ్ల కిందట పరికరాన్ని అట్టహాసంగా ప్రారంభించినా నేటికీ శిక్షణ ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇదీ ఉద్దేశం: రహదారి ప్రమాదాలను నివారించడంతోపాటు వాహనదారులు కార్లు, ఇతర వాహనాల డ్రైవింగ్‌లో ప్రాథమిక అంశాలు, మెలకువలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో డ్రైవింగ్ సిమ్యులేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. శిక్షణ పొందేవారికి తెలిసేలా సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. డ్రైవింగ్ మెలకువలు, సీటు బెల్టు పెట్టుకోవడం, గేర్లు మార్చడం, మార్జిన్ చూసుకోవడం వంటివి వర్చువల్‌గా నేర్పిస్తారు. తర్వాత ధ్రువీకరణ పత్రం అందిస్తారు. దీని ఆధారంగా రవాణా శాఖ అధికారులు డ్రైవింగ్ పరీక్ష పెట్టి లర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సులను మంజూరు చేస్తారు.

రాష్ట్రంలోనే రెండోది: మంత్రి అజయ్‌కుమార్ చొరవతో రూ.3 లక్షలు ఖర్చు చేసి ఈ పరికరాన్ని ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. 2020, ఆగస్టు 10న మంత్రి, నాటి రవాణా శాఖ కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావు, నాటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అట్టహాసంగా ప్రారంభించారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయం తర్వాత రాష్ట్రంలోనే రెండో సిమ్యులేటర్‌గా గుర్తింపు పొందింది. మిత్రా ఆటో ఏజెన్సీస్ కంపెనీకి చెందిన మారుతీ సుజుకీ డ్రైవింగ్ స్కూల్‌కు దీని నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. రెండున్నరేళ్లు దాటినా దరఖాస్తులను సైతం ఆహ్వానించలేదు. అనుమతులు రాకపోవడంతో నిర్వహణ సంస్థ నుంచి ఎలాంటి స్పందన లేదని తెలుస్తోంది.

త్వరలోనే శిక్షణ ప్రారంభమయ్యేలా చర్యలు

నిర్వహణ సంస్థ దరఖాస్తు చేసుకున్నా అనుమతులు మంజూరు కాలేదని తెలిసింది. సంబంధిత అనుమతులు వచ్చిన తర్వాత నిర్వహణ సంస్థ యాజమాన్యంతో మాట్లాడి త్వరలోనే డ్రైవింగ్ శిక్షణ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించిన తర్వాతే లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

తోట కిషన్‌రావు, ఖమ్మం జిల్లా రవాణాశాఖాధికారి

# ఆయువు పోసేచోట వాయువు కరవు



ఖమ్మం : కొవిడ్ ఉద్ధృతి సమయంలో కొత్తగూడెం జిల్లా సర్వజన ఆసుపత్రిలోని 250 పడకలకూ సెంట్రల్ ఆక్సిజన్ సదుపాయం ఉన్నా తదనంతరం నిర్వహణ లోపంతో ఈసౌకర్యం సుమారు 140 పడకలకే పరిమితమైంది. జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రాణవాయువు కొరత వేధిస్తోంది. ఆక్సిజన్ అందుబాటులో లేదనే సాకుతో ఏ చిన్న సమస్య వచ్చినా ఖమ్మం పంపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించాల్సిన 108 వాహనాలు రామవరం ఎంసీహెచ్ నుంచి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోగులను తరలించాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు రోజూ సగటున రెండు వరకు జరుగుతుండటం గమనార్హం. రూ.16కోట్లతో ఎంసీహెచ్ నిర్మించినా..సుమారు రూ.16కోట్లతో నిర్మించిన 100 పడకల ఎంసీహెచ్(మాతా శిశు సంరక్షణ కేంద్రం)లో ఇప్పటివరకు లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్ (ఎల్‌ఓటీ)ను అందుబాటులోకి తీసుకురాకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా నలుమూలల నుంచి ప్రసూతి సేవల కోసం ఎంసీహెచ్‌కు తరలివస్తున్నారు. ఇక్కడ చిన్నపిల్లలకు నవజాత శిశు చికిత్స కేంద్రం ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబర్న్ కేర్ యూనిట్) అందుబాటులో ఉంది. బల్క్ సిలిండర్ల ద్వారా చిన్న పిల్లలు చికిత్స పొందే 50 పడకల వరకు సెంట్రల్ ఆక్సిజన్ సదుపాయం కల్పించారు. గర్భిణులు, బాలింతలకు చికిత్స అందించేందుకు బీ టైప్, డీ టైప్, బల్క్ సిలిండర్లు 50 వరకు వినియోగిస్తున్నారు. ఆక్సిజన్ సిలిండర్ పూర్తయితే సత్వరం మార్చేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోతే అవస్థలు తప్పడం లేదు. జిల్లా సర్వజన ఆసుపత్రి నుంచి అంబులెన్స్‌లో సిలిండర్లను ఇక్కడికి తెప్పిస్తున్నారు.

లీకేజీలను అరికడితేనే..

కొవిడ్ సమయంలో కొత్తగూడెం జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఎల్‌ఓటీని 12వేల లీటర్ల సామర్థ్యంతో అందుబాటులోకి తెచ్చారు. 250 పడకల్లో సుమారు 100 పడకల వరకు (కొత్త వార్డుల్లో), అత్యవసర చికిత్స విభాగం (సీఓటీ)లోని పది పడకలకు సెంట్రల్ ఆక్సిజన్ సదుపాయం కొరవడింది. సెంట్రల్ ఆక్సిజన్ పైపులైన్లలో లీకేజీలను అరికట్టాలి. నూతనంగా నిర్మించిన వార్డుల్లో సెంట్రల్ ఆక్సిజన్ లేకపోవడం వల్ల సిలిండర్లు వినియోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ పాయింట్లు ఉన్న పడకల్లో చికిత్స అందిస్తున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ విభాగాన్ని సిద్ధం చేసి 30 పడకలకు సెంట్రల్ ఆక్సిజన్ సదుపాయం కల్పించారు. పది వెంటిలేటర్లు, బల్క్ సిలిండర్లను 160 వరకు అందుబాటులో ఉంచుతున్నారు. 60 డీటైప్, 50 బీటైప్ సిలిండర్లతో ఆక్సిజన్ కొరత ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో..

ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో 13వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఎల్‌ఓటీ ద్వారా 550 పడకలకు సెంట్రల్ ఆక్సిజన్ సదుపాయం కల్పించారు. రోజూ 900- 1,100 లీటర్ల ఆక్సిజన్ వినియోగిస్తున్నారు. ఎల్‌ఓటీతో పాటు కృత్రిమ ప్రాణవాయువు సిలిండర్లను ముందస్తు జాగ్రత్తగా సిద్ధం చేశారు. బీ టైప్ సిలిండర్లు-220, ఆపరేషన్ థియేటర్‌లో ఎన్ఓటూ సిలిండర్లు ఐదింటిని అందుబాటులో ఉంచారు. ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు- 40, పది లీటర్ల సిలిండర్లు- 10, ఐదు లీటర్ల సిలిండర్లు 30, వివిధ సంస్థలు అందించిన మరో 60 సిలిండర్లు ఉన్నాయి.

# ఏ నిమిషానికి ఎక్కడున్నదో..



ఖమ్మం : సమయానికి రానిదే ఆర్టీసీ బస్సు' అనే నానుడి వాడుకలో ఉంది. బస్సులు ఎప్పుడు బయలుదేరుతాయో? ఏ సమయంలో తిరిగి చేరుకుంటాయో? అనే సమాచారం లేక ప్రయాణికులు నిరీక్షిస్తుండటం సహజమే. ముఖ్యంగా దూరప్రాంతాలకు, ముఖ్య పనులపై వెళ్లే రిజర్వేషన్ ప్రయాణికులకూ ఆందోళన తప్పడం లేదు. నిరీక్షణ, అసహనాన్ని సాధ్యమైనంత దూరం చేసే పనిలో ఉంది ఆర్టీసీ యాజమాన్యం. రిజర్వేషన్ ప్రయాణికులను మెరుగైన సేవలతో ఆకట్టుకునేందుకు కొత్త ప్రయోగం చేస్తోంది.

ఏమిటీ ప్రయోగం.. బస్టాండు నుంచి బయలుదేరిన బస్సు ఎక్కడ వరకు వెళ్లిందో తెలుసుకునేందుకు అదే.. 'జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం'ను కొత్తగా ప్రవేశపెట్టనున్నారు. దీని సాయంతో మనం ప్రయాణించాల్సిన రైలు ఎక్కడ ఉందో కొన్ని యాప్‌ల ద్వారా తెలుసున్నట్లుగానే.. ప్రయాణ ప్రాంగణానికి చేరాల్సిన బస్సు ఎక్కడ వరకు వచ్చిందో తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఖమ్మం రీజియన్‌లోని అన్ని సర్వీసులకు ప్రత్యేక పరికరాల(డివైస్)ను అమర్చారు. వాటిని ఆన్‌లైన్ వ్యవస్థకు అనుసంధానం (యాక్టివేట్) చేసే పనిలో ఉన్నారు. తొలుత 'ఐ-టిమ్' మెషిన్లు ఉన్న ఏసీ, సూపర్‌లగ్జరీ సర్వీసుల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే కొన్ని సర్వీసులతో ప్రయోగాత్మక పరిశీలన చేపట్టారు. ఏసీ, సూపర్ లగ్జరీల తర్వాత ఎక్స్‌ప్రెస్‌లు, పల్లెవెలుగులకూ ట్రాకింగ్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. టికెట్ రిజర్వేషన్ చేసుకున్న వెంటనే ప్రయాణికుడి స్మార్ట్‌ఫోన్‌కు ఒక లింకు వస్తుంది. బస్సు, సర్వీస్ నంబర్లు నమోదు చేసి క్లిక్ చేస్తే ట్రాకింగ్ సమాచారం తెలుస్తుంది. ఈ సేవలు పొందేందుకు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. 2013లో ఉమ్మడి ఏపీలోనే ఈ తరహా సంస్కరణకు తొలుత శ్రీకారం చుట్టారు. వీటీపీఐఎస్ అనే కంపెనీతో యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. కొందరు డీఎంలు తమిళనాడులోని చెన్నైకి అధ్యయనానికి కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత పలు కారణాలతో ప్రాజెక్టు నిలిచిపోయింది. కొత్తగా ప్రస్తుతం తెరమీదకు వచ్చింది. ప్రస్తుతం 'మ్యాప్ ఇండియా' అనే కంపెనీ వారు సర్వీసులకు 'డివైస్' ఇన్‌స్టాలేషన్ చేస్తున్నారు.

డిపోల వారీగా బస్సులు ఇలా..

ఖమ్మం 138

మధిర 62

సత్తుపల్లి 93

భద్రాచలం 86

మణుగూరు 62

కొత్తగూడెం 68

'ప్రయాణికులకు నాణ్యమైన సేవలు మరింత చేరువ చేసేందుకు ట్రాకింగ్ సిస్టం అందుబాటులోకి తీసుకరానున్నాం. సంబంధిత పనులు త్వరలో పూర్తికానున్నాయి. ఆ వెంటనే సేవలు ప్రారంభిస్తాం. ప్రస్తుతం డ్రైవింగ్‌లో ఉన్న సమయంలో ప్రయాణికుల నుంచి ఫోన్లు రావడం, వారికి సమాధానం ఇవ్వడం డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది. ఇకపై ఈ ఇబ్బంది లేకుండా ప్రయాణికులే నేరుగా జీపీఎస్‌తో సర్వీసు తాజా సమాచారం పొందొచ్చు.' ఎస్తర్ ప్రభులత, ఖమ్మం ఆర్ఎం

# కేటాయింపులు సరే.. నిధుల విడుదలేది..?

ఖమ్మం : ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కారు 2022-23 బడ్జెట్‌లో ఆయిల్‌పాంకు తొలిసారిగా రూ.1000కోట్లు నిధులు కేటాయించి అభినందనలు అందుకున్నారు. ఈ ఏడాదీ (2023-24లో) అదే రీతిలో నిధులు కేటాయించింది. ఏ ప్రభుత్వం కేటాయించని విధంగా ఆయిల్‌పాంకు రూ.1000కోట్లు కేటాయించడంతో గత ఏడాది ఆయిల్‌పాం రైతులు ఎంతో ఆశించారు. వాస్తవంగా చూస్తే గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన రూ.1000 కోట్ల నిధుల్లో రూ.120 నుంచి రూ.150 కోట్లకు మించి విడుదల కాలేదు. ఆశించిన స్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో రైతుల్లో ఒకింత నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. నిధుల విడుదల సాఫీగా సాగితే ఆయిల్‌ఫెడ్ మరింత శోభాయమానంగా ఉండేదని రైతుల అభిప్రాయం. ప్రస్తుతం రాష్ట్రంలో 1.24లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగులో ఉంది. రాష్ట్రంలో గత ఏడాది చేపట్టిన చర్యలతో మొక్కల కొరత ఒకింత తీరినా, పరిశ్రమల నిర్మాణం, ఉన్న పరిశ్రమల విస్తరణలో జాప్యం కావడంతో రైతులకు ఈ ఏడాది, వచ్చే ఏడాదీ ఇబ్బందులు తప్పేలా లేవు.

ఉద్యాన పంటలపై చిన్నచూపేల..?

ఆయిల్‌పాంకు కొంతలో కొంత ప్రాధాన్యం ప్రభుత్వం ఇతర ఉద్యాన పంటలపై పూర్తి చిన్నచూపు చూస్తోందన్న విమర్శలూ ఉన్నాయి. కొబ్బరి, మామిడి, అరటి, జీడిమామిడి, సపోటా, లాంటి ఉద్యాన పంటల రాయితీలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ పంటలు వేసిన రైతులు ప్రభుత్వం ఇచ్చే రాయితీని పొందలేకపోయారు. తెలంగాణలో కొబ్బరి బోర్డు ప్రత్యేక శాఖ లేకపోవడంతో రైతులకు దక్కాల్సిన సుమారు రూ.30లక్షలు వెనక్కు వెళ్లాయి. బిందు సేద్యం పరికరాలు ఆయిల్‌పాం రైతులకు మినహా మిగిలిన ఉద్యాన పంటలు సాగు చేసే రైతులెవరికీ ఒక్క ఎకరాకూ మంజూరు కాలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే రాయితీల రూపంలోనే రైతులకు దక్కాల్సిన సుమారు రూ.50కోట్లు జాడలేదు. ఇదే పరిస్థితి ఉంటే రానున్న రోజుల్లో ఇతర ఉద్యాన పంటలు కనుమరుగయ్యే ప్రమాదమూ పొంచి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం



సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ ఆయిల్‌పాంకు రూ.1000కోట్లు కేటాయించడం అభినందనీయమే అయినా ఇతర ఉద్యాన పంటలకు ఏపాటి న్యాయం జరగనుందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సమస్యలను పరిశీలిస్తే.. అశ్వారావుపేటలో 30 టన్నుల సామర్థ్యంతో రెండో పరిశ్రమ ఏర్పాటు. ఇది 2025 నాటికి పూర్తి కావల్సి ఉంది. ఈ సారైనా బడ్జెట్‌లో కేటాయించిన రూ.1000కోట్లలో సగానికి పైగా నిధులు విడుదల కాకపోతే 2025 నాటికి నూతన పామాయిల్ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండదు. నిధుల విడుదల జాప్యంతో అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమల్లో చేపట్టిన విస్తరణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.సిద్దిపేట, తొర్రూరు, వేంసూరు మండలం కల్లూరిగూడెంలో నూతన పరిశ్రమల ఏర్పాటు ప్రకటనలకే పరిమితమయ్యాయే గాని నిధుల జాడలేదు.

ఇదే పరిస్థితి ఉంటే ప్రభుత్వం నిర్దేశించుకున్న 2.24లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు మరికొన్నేళ్లు పట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

# అరకొర వసతులు.. తప్పని కష్టాలు!

మహబూబాబాద్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో సరిపడా వసతులు లేక చిన్నారులు, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె భవనాలు చాలా వరకు ఇరుకుగా ఉండడం..సరైన సౌకర్యాలు లేక లబ్ధిదారులు, ప్రీస్కూల్‌కు వచ్చే పిల్లలు అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న కేంద్రాల్లోనూ సమస్యలున్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఒకటికి, రెండుకు సమస్యగా ఉంది. కొన్ని చోట్ల ఆయాలు పిల్లలను తమ ఇంటికి తీసుకెళ్తున్నారు. క్రీడాపరికరాలు పనిచేయకపోవడంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. విద్యుత్తు సౌకర్యం లేని కేంద్రాలున్నాయి. సదుపాయం కల్పించాలని ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యం.

ఆదర్శ కేంద్రాల్లోనూ..

ఇరవై కేంద్రాలను 2017లో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. పిల్లలకు బడిపై ఆసక్తిని కలిగించేందుకు వివిధ రకాల ఆట వస్తువులు, టీవీ, రంగు రంగుల కుర్చీలు, గోడల మీద ఆకర్షణీయమైన బొమ్మలను గీయించారు. ఇందుకోసం ఒక్కో కేంద్రానికి సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. 2022లో మరో 20 కేంద్రాలను తీర్చిదిద్దారు. తొలుత ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. ఆటవస్తువులు సరిగా లేవు. చాలా చోట్ల టీవీల ద్వారా పిల్లలకు ఆటపాటల విద్య అందడం లేదు.ఇది నెల్లికుదురులోని మూడో అంగన్‌వాడీ కేంద్రం. 18 మంది ప్రీస్కూల్ విద్యార్థులున్నారు. 11 మంది గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. దీనిని 2017లో రూ.2 లక్షల ఖర్చుతో ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దారు. పిల్లలను ఆకర్షించేలా గోడలపై రంగు రంగుల బొమ్మలను గీయించారు. పిల్లలకు ఆటపాటలతో విద్యనందించేందుకు 32 అంగుళాల సోని ఎల్ఈడీ టీవీని అందించారు. పిల్లలు కూర్చునేందుకు కుర్చీలను ఇచ్చారు. కానీ విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. దీంతో టీవీని పక్కన పెట్టారు. మూత్రశాలల వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో బకెట్ ద్వారా నీటిని తీసుకెళ్తూ ఇబ్బంది పడుతున్నారు.

వర్షం వస్తే కురవకుండా ఇంటి కప్పుపై కప్పిన టార్పాలిన్ పరదాతో కనిపిస్తున్నది బయ్యారం మండలం రావికుంట తండాలోని అంగన్‌వాడీ కేంద్ర అద్దె భవనం. నెలకు రూ.500 కిరాయి చెల్లిస్తున్నారు. ఏడుగురు ప్రీస్కూల్ పిల్లలుండగా ఆరుగురు గర్భిణులు, బాలింతలు పోషకాహారం పొందుతున్నారు. ఈ ఇల్లు మొత్తం అంగన్‌వాడీ కేంద్రం కాదు. వరండాలోనే పిల్లలు చదువుకోవాలి. కేంద్రానికి సంబంధించిన సామగ్రిని భద్రపరుచుకునేందుకు పక్కనే ఉన్న చిన్న గదిని వాడుతున్నారు. అక్కడ మూత్రశాల ఉన్నప్పటికీ ఇంటి యాజమానులు దానిని వాడుకోవద్దని ఆదేశించడంతో పిల్లలు బయటికి వెళ్లాల్సి వస్తోందని ఆయా బాయమ్మ తెలిపారు. ఈ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం బయ్యారం మండలం పెత్తాళ్లగడ్డ-2. గత ఏడాది సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కేంద్రంలో విద్యుత్తు సౌకర్యం ఉండడంతో 11 మంది ప్రీ స్కూల్ పిల్లలకు రోజూ ఆటపాటలతో విద్యాబోధన జరుగుతోంది. నలుగురు గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. పిల్లలకు మూత్రశాల, మరుగుదొడ్డి లేదు. పాఠశాలలోని వాటిని వినియోగిస్తున్నారు. అధికారులను అడిగితే పిల్లల సంఖ్యను పెంచితే ఆ సౌకర్యాలను కల్పిస్తామని చెబుతున్నారని ఆయా చెబుతుంది.

# రాష్ట్ర పద్దు.. నగరానికి ముద్దు!

మహబూబాబాద్ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు శాసనసభలో ప్రవేశపెట్టిన 2023-24 ఆర్థిక సంవత్సరం పద్దు(బడ్జెటు)పై మహా నగర పాలక సంస్థ గంపెడాశలు పెట్టుకుంది. ఈసారి నిధులు వస్తాయనే ధీమాలో పాలకవర్గం, అధికారులున్నారు. రాష్ట్ర పద్దులో గ్రేటర్ వరంగల్‌కు ప్రత్యేకంగా నిధులు రానున్నాయి. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న స్మార్ట్ సిటీ పథకం పనులకు రూ.200 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటా కింద సుమారు రూ.250 కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్లు విడుదలయ్యాయి. త్వరలో రూ.200 కోట్లు విడుదల కానున్నాయి. రాష్ట్ర బడ్జెటులో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.11,327 కోట్లు కేటాయించారు. ఇందులో పట్టణాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రత్యేకంగా రూ.1500 కోట్లు కేటాయించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ, వరంగల్ జీడబ్ల్యూఎంసీ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ తదితర నగరపాలికలు, ముఖ్యమైన పురపాలికలకు నిధులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరానికి చెందిన శాసనసభ్యులు శ్రద్ధపెడితే ప్రత్యేకంగా నిధులు వచ్చే అవకాశాలుంటాయని నిపుణులంటున్నారు.

వేగవంతం కానున్న అసంపూర్తి పనులు

స్మార్ట్ సిటీ పథకం ద్వారా సుమారు రూ.976.50 కోట్లతో 76 పనులు ప్రతిపాదించారు. కేంద్రం 50 శాతం, రాష్ట్రం 50 శాతం నిధులు కేటాయించాలి. నిధుల విడుదలలో జాప్యం కావడంతో ఐదేళ్లలో కేవలం రూ.39.26 కోట్లతో 26 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సుమారు రూ.193 కోట్లు కేటాయించింది. మరో రూ.50 కోట్లు త్వరలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్లు విడుదల చేసింది. ఈసారి 2023-24 రాష్ట్ర వార్షిక పద్దులో స్మార్ట్ సిటీ పనులకు రూ.200 కోట్లు కేటాయించింది. ఈ నిధులన్నీ వరంగల్ నగరానికి ఇవ్వనున్నారు. స్మార్ట్ సిటీ పనులు చేస్తున్న గుత్తేదారులకు చేపట్టిన పనులకు బిల్లులివ్వక పోవడంతో హనుమకొండ వడ్డేపల్లి, వరంగల్ భద్రకాళి బండ్-2 పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. ఉర్సు ట్యాంకు బండ్ పనులు ఇంతవరకు మొదలే కాలేదు.వరంగల్ తూర్పులో 11 స్మార్ట్ రోడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. సగం సగం రహదారులు, భూగర్భ మురుగు కాల్వలు, సెంట్రల్ డివైడర్లు, నడక దారులు, సుందరీకరణ తదితర పనులు పూర్తి కాలేదు. వరంగల్ పశ్చిమలో హనుమకొండ కొత్త బస్టాండ్, ఎన్జీవోస్ కాలనీ స్మార్ట్ రోడ్డు పనులు మధ్యలో వదిలేశారు.

పట్టణ ప్రగతికి ఢోకా లేదు

పట్టణ ప్రగతి ద్వారా గ్రేటర్ వరంగల్‌కు నెలకు రూ.7.23 కోట్లు రావాలి. కొన్ని నెలలుగా నిధులు విడుదల కాలేదు. 2023- 24 వార్షిక పద్దులో పల్లె, పట్టణ ప్రగతి అమలు కోసం నిధులు కేటాయించారు. 2019 కొత్త పురపాలక చట్టం ప్రకారం పట్టణాల జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయిస్తారు. ఈ ఏడాది నగరపాలిక, పురపాలికలకు నిధులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

వరద ప్రవాహ కాల్వలకు రూ.30 కోట్లే

వరంగల్‌ను ముంపు నుంచి తప్పించేందుకు వరద ప్రవాహ కాల్వలు(స్టార్మ్ వాటర్ డ్రైనేజీ) చాలా అత్యవసరం. హనుమకొండ నయీంనగర్, పోచమ్మకుంట, రంగంపేట, అలంకార్, కాకతీయ కాలనీల్లో వరద ప్రవాహ కాల్వలకు నిధులు కావాలి.



**జేపీ నడ్డాతో చంద్రబాబు మాటా మంతీ :** రాష్ట్రపతి భవన్‌లో ఎన్టీఆర్ స్మారక నాణేన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేశారు. అయితే ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో టీడీపీ అధినేత చంద్రబాబు మాటా మంతీ ఆసక్తికరంగా మారింది. దేశ రాజకీయాలతో పాటు, ఏపీ రాజకీయాలపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగింది. ఏపీలో జగన్ పాలన వైఫల్యాలను జేపీ నడ్డాకు చంద్రబాబు వివరించినట్లు సమాచారం. ఓటర్ల తొలగింపు అక్రమాలనూ నడ్డా దృష్టికి చంద్రబాబు తీసుకొచ్చారు. కాగా.. ఈ కార్యక్రమం అనంతరం చంద్రబాబు ఎన్నికల కమిషన్‌ను కలవనున్నారు. ఏపీలో ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఫిర్యాదు చేయనున్నట్టు తెలుస్తోంది. కాగా.. నేటి ఉదయం ఈ రోజు ఉదయం 10.30 గంటలకు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నాణెం విడుదల చేయడం జరిగింది. 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో నాణెం తయారు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.




**సీఎం జగన్ చొరవ చూపినా.. చేతులు కలిపేందుకు రోజా, శాంతి అయిష్టత :** నగరి: సీఎం జగన్ సమక్షంలో చిత్తూరు జిల్లా నగరి వైకాపా నేతల విభేదాలు బయటపడ్డాయి. విద్యాదీవెన నిధులు విడుదల కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ నగరిలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా, కేజే శాంతి చేతులు కలిపేందుకు సీఎం యత్నించారు. జగన్ చొరవ చూపినా చేతులు కలిపేందుకు రోజా, శాంతి అయిష్టత చూపారు. దీంతో బలవంతంగానే ఇద్దరు మహిళా నేతల చేతులను సీఎం కలిపారు.




అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై ఏపీ పాఠశాల విద్యాశాఖ నిషేధం విధించింది. పాఠశాలలకు విద్యార్థులు మొబైల్ ఫోన్లు తేవటంపై పూర్తి నిషేధం విధిస్తూ మోమో జారీ చేసింది. ఉపాధ్యాయులు సైతం తరగతి గదుల్లోకి ఫోన్లు తీసుకురాకుండా ఆంక్షలు విధించింది. టీచర్లు తరగతి గదులకు వెళ్లేముందు తమ మొబైల్స్‌ను ప్రధానోపాధ్యాయుడికి అప్పగించాలని సూచించింది. యునెస్కో విడుదల చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్ట్ ఆధారంగా.. బోధనకు ఎటువంటి ఆటంకం రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఉపాధ్యాయ సంఘాలు, ఇతర వర్గాలతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పై అధికారులు ఈ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశాలు ఇచ్చింది.




## జఫ్ఫాలకు అది మాత్రమే తెలుసు.. వైసీపీపై మీమ్స్ మాములుగా లేవుగా..!!

విశాఖలో జీవీఎంసీ కార్యాలయం సమీపంలో వైసీపీ ప్రభుత్వం కొత్తగా నిర్మించిన బస్ బే కూలిపోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కూల్చడమే కాని నిర్మించడం చేతకాని జగన్ ప్రభుత్వం కట్టిన బస్ బే కూలిపోవడం వైసీపీ సర్కారు పనితీరుకు నిదర్శనమని అందరూ చర్చించుకుంటున్నారు. బస్ బే నిర్మాణంలో పెద్ద స్కాం జరిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరీ ముఖ్యంగా ఈ ఘటనపై సోషల్ మీడియాలో మీమ్స్ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. రూ.5 కోట్లు ఖర్చుపెట్టి ప్రభుత్వం నిర్మించింది ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. కనీసం 5 నెలలు తిరగకుండానే బస్ బే కూలిపోవడంలో అవినీతి దాగి ఉందని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రూ.లక్ష కూడా విలువ చేయని ధర్మాకోల్‌తో కట్టి రూ.4-5 కోట్లు ఖర్చు చేశామని వైసీపీ నేతలు చెప్పుకోవడం నిజంగా సిగ్గుచేటు అని సోషల్ మీడియాలో నెటిజన్‌లు విమర్శిస్తున్నారు. జఫ్ఫాలకు కూల్చడమే కానీ ఎలా కట్టాలో తెలియదంటూ సెటైర్లు వేస్తున్నారు. గతంలో టీడీపీ సర్కారు నిర్మించిన ప్రజావేదికను కూలగొట్టిన వైసీపీ ప్రభుత్వానికి తగిన శాస్తి జరిగిందంటూ కామెంట్ చేస్తున్నారు. బస్ బే సరిగ్గా కట్టలేని ప్రభుత్వానికి మూడు రాజధానులు కట్టేంత సీనుందా అని పలువురు నెటిజన్‌లు ప్రశ్నిస్తున్నారు. బస్ బే నిర్మాణం జగన్ ప్రభుత్వ క్వాలిటీ, బ్రాండ్‌ను తెలియజేస్తోందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఈ బస్ బేకు జగన్ ఫోటో పెట్టడంపైనా మీమ్స్ రాయుళ్లు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. కంటెంట్ వీక్.. ప్రచారం పీక్స్ అన్న తరహాలో జగన్ తీరు ఉందని మండిపడుతున్నారు. ప్రతి పనిలో తన ఫోటో వేసుకోవడం జగన్‌కు ఫ్యాషన్ అయిపోయిందని చురకలు అంటిస్తున్నారు. మరోవైపు BUS BAY కూలిందంటే తప్పునాది కాదు కట్టిన మేస్త్రిది అన్నట్లు జగన్ నీతులు చెప్తారని.. నాడు నేడు స్కూల్లో పిల్లలు 10th క్లాస్ ఎగ్జామ్ పాస్ కాకపోతే తప్పునాది కాదు పాఠాలు చెప్పిన టీచర్‌ది అంటారని.. కల్తీ బ్రాండ్స్ తాగి సచ్చిపోతే తప్పు నాది కాదు తాగిన మందు బాబులది అంటారని పలువురు నెటిజన్‌లు సెటైర్లు వేస్తున్నారు.




నూహ్: ఇటీవల అల్లర్లు చెలరేగిన హరియాణాలోని నూహ్ జిల్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారులు అనుమతి ఇవ్వనప్పటికీ హిందూ సంస్థలు సోమవారం శోభాయాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నూహ్ వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూళ్లు, బ్యాంకులు మూసివేశారు. ప్రజలు గుమిగూడకుండా 144 సెక్షన్ విధించారు. మొబైల్ ఇంటర్నెట్, బల్క్ ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేశారు. శ్రావణమాసం చివరి సోమవారాన్ని (ఉత్తరాది ప్రకారం) పురస్కరించుకుని హిందూ సంస్థలు శోభాయాత్రకు పిలుపునిచ్చాయి. అయితే, సెప్టెంబరు 3-7 వరకు జీ20 షెర్పా గ్రూప్ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శోభాయాత్రకు అనుమతివ్వలేమని అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ నేడు శోభాయాత్రను నిర్వహించి తీరుతామని విశ్వహిందూ పరిషత్ తేల్చి చెప్పింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. 30 కంపెనీల పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించారు. జిల్లా సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి.. నూహ్ వ్యాప్తంగా ఎక్కడికక్కడ బారికేడ్లను పెట్టారు. బయటి జిల్లాల వారిని నూహ్‌లోకి అనుమతించడం లేదు. దూకాణాలు తెరవద్దని స్థానికులకు సూచించారు. సోమవారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేశారు.

**చాట్‌జీపీటీ ఆధారంగా తీర్పులివ్వలేం: దిల్లీ హైకోర్టు - అయోధ్య సాధువుల అడ్డగింత..** నూహ్‌లోని నల్హర్ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజల్లో పాల్గొనేందుకు అయోధ్య నుంచి కొంతమంది సాధువులు రాగా.. వారిని సరిహద్దుల్లోనే పోలీసులు అడ్డుకున్నారు. ఆంక్షలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

**ఆలయాల్లో పూజలు చేసుకోండి: సీఎం ఖట్టర్ -** భద్రతా కారణాల దృష్ట్యా శోభాయాత్రకు తాము అనుమతినివ్వలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. అయితే, ప్రజలు సమీపంలోని ఆలయాలకు వెళ్లి పూజలు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు. జులై 31వ తేదీన నూహ్‌లో విశ్వహిందూ పరిషత్ చేపట్టిన ర్యాలీపై దుండగులు జరిపిన మూకదాడి హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే.

ఆ సమయంలో జరిగిన అల్లర్లలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నుచి నూహ్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు.




## అధికార భాషాసంఘం ఆహ్వాన పత్రికల్లోనే అచ్చు తప్పులు

అమరావతి: ఆయన తెలుగు అధికార భాషాసంఘానికి అధిపతి విజయబాబు. తేట తెలుగుపై గొప్ప గొప్ప మాటలు చెబుతారు. రాజకీయాలకు అతీతంగా సంఘాన్ని నడిపించాల్సిన ఆయన నిరంతరం సీఎం జగన్ ప్రాపకం కోసం పరితపిస్తుంటారు. అందుకే ప్రతిపక్ష నేతలకు తెలుగు ఎలా మాట్లాడాలో నేర్పిస్తామంటారు.

అలాంటి ఆయ నకు ఉన్న తెలుగు భాషాపటిమ చూస్తే తెలుగు భాషాభిమానులు నివ్వెరపోవాల్సిందే. గిడుగు పురస్కార గ్రహీతలకు ఆయన పంపిన ఆహ్వానపత్రికను చూసితీరాల్సిందే. ఆ పత్రికలో ఒకటి, రెండు కాదు... ఏకంగా తొమ్మిది అక్షర దోషాలతో అతిథులే విస్తుపోయేలా తెలుగుకే తెగులు తెచ్చారు.

**గుడి దీర్ఘాలు.. ఒత్తులూ తెలియవా?** తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం తెలుగు వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కొందరిని గిడుగు పురస్కారానికి ఎంపిక చేసింది. అవార్డు అందించేందుకు మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమానికి ఆహ్వానిస్తూ సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు వాట్సప్ ద్వారా ఆహ్వానపత్రిక పంపారు. 10 వరసల పేరాలో 9 పదాల్లో అక్షర దోషాలున్నాయి. దీర్ఘం, గుడి దీర్ఘం, ఒత్తులు కూడా సరిగా రాయని పరిస్థితి. 'గ్రహిత.. తేది.. గౌరవనియులైన.. నిర్వహిస్తున.. ఆహ్వాన్నాని'.. ఇలా దాదాపు ప్రతి వాక్యంలోనూ తప్పులు దొర్లాయి. చివరకు తమ సంస్థ పేరునూ సక్రమంగా రాయక.. 'తెలుగు భాషాబివృధి ప్రాధికార సంస్థ' అన్నారు. మొదట ఇలా పలు తప్పులతో ఆహ్వానపత్రిక పంపించిన ఆయన.. ఆ తర్వాత వాటిని సరిచేస్తూ మరో ఆహ్వానపత్రికను పంపించారు.

## 'ఎన్టీఆర్ స్మారక నాణెం' విడుదల... ఎన్టీఆర్ మనవడిగా గర్విస్తున్నా..



అమరావతి: ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం "ఎన్టీఆర్ స్మారక నాణెం" ఆవిష్కరించడం తెలుగుజాతికి దక్కిన గొప్ప గౌరవమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

తెలుగువాడిగా, తెలుగుదేశం పార్టీ వాడిగా, నందమూరి తారకరామారావు మనవడిగా గర్విస్తున్నానన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడు, ప్రజాసేవకుడు, తెలుగుజాతిని ఒక్కతాటిపై నడిపించిన మహానాయకుడని కొనియాడారు. కోట్లాది హృదయాల్లో దేవుడై కొలువైన ఎన్టీఆరే తమ స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు.

శకపురుషుడు శతజయంతిని చరిత్రలో నిలిచిపోయేలా "ఎన్టీఆర్ స్మారక నాణెం" విడుదల చేసిన గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, కేంద్ర ప్రభుత్వానికి లోకేశ్ ధన్యవాదాలు తెలియజేశారు. కాగా.. ఎన్టీఆర్ స్మారక నాణాన్ని రాష్ట్రపతి ముర్ము ఈరోజు విడుదల చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు, ఏపీ బీజేపీ చీఫ్, ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి, దగ్గుపాటి వెంకటేశ్వర్లు, నటుడు బాలకృష్ణ, నారా బ్రాహ్మణి, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు. టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్ర కుమార్, గల్లా జయదేవ్, కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, ఎంపీ రఘురామ కృష్ణరాజు, బీజేపీ ఎంపీ సీఎం రమేష్, మాజీ ఎంపీ సుజనా చౌదరి, కంభంపాటి రామ్మోహన్ రావు, బాలకృష్ణ, అశ్విని దత్, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తదితరులు ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఏపీ ఎన్నికల అధికారికి అచ్చెన్నాయుడు లేఖ



అమరావతి: రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ మీనాకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడు లేఖ రాశారు. తాడికొండ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారీ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని తెలిపారు. ఒక వార్డులో ఉన్న వాళ్ళను ఒక బూత్‌కు కాకుండా 8 వేరువేరు బూత్‌లకు కేటాయించారన్నారు. ఒక కుటుంబం సభ్యులను నాలుగు బూత్‌లలో చూపారని.. 150 మంది మృతుల ఓట్లను కూడా తొలగించలేదని వెల్లడించారు. 0 ఇంటి నెంబర్‌తో 53 ఓట్లు ఉన్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు లేఖలో కోరారు.

## ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఎన్టీఆర్ స్మారక నాణెం...

న్యూఢిల్లీ: స్వర్గీయ ఎన్టీ రామారావు స్మారక నాణాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి చంద్రబాబు సహా ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. అయితే ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఎన్టీఆర్ స్మారక నాణెం లభిస్తుందని భారత ప్రభుత్వం హైదరాబాద్ మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వీఎన్ఆర్ నాయుడు ప్రకటించారు. ఈరోజు (సోమవారం) ఎన్టీరామారావు స్మారక నాణెం విడుదల చేయడం జరిగిందన్నారు. హైదరాబాదులోని మింట్ కార్యాలయంలో కూడా ఎన్టీఆర్ స్మారక నాణెం దొరుకుతుందన్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం 12 వేల కాయిన్స్ ఇప్పటి వరకు ముద్రణ వేశామని చెప్పారు. 100 రూపాయల నాణెంలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారుచేసినట్లు వెల్లడించారు. వంద రూపాయల




నాణెం తయారు చేసేందుకు ఆర్థిక శాఖ అప్రూవల్ ఇచ్చిందన్నారు. హైదరాబాద్ మింట్‌లో మొదటిసారిగా ఎన్టీఆర్ స్మారక నాణాన్ని తయారు చేసినట్లు వీఎన్ఆర్ నాయుడు పేర్కొన్నారు.

# పిజ్జా తింటే సరే కానీ.. మరీ ఇంతగా హొయలు పోవాలా?

పిజ్జాలు బర్గర్లు తినడం నేటితరం ట్రెండ్. రాగి జావ- సగ్గు బియ్యం- సేమియాల రోజులు పోయాయి. కే.ఎఫ్.సి- డోమినోస్ అంతర్జాతీయ బ్రాండ్ ఆహారాల్ని రోస్టెడ్ ప్యాకింగ్ ఫుడ్స్ ని మాత్రమే అబగా ఆరగించడం యువతరానికి అలవాటైపోయింది. ఏదైతేనేం.. ఇక్కడ రాశీఖన్నా అందుకు మినహాయింపేమీ కాదు. కెరీర్ తొలి నాళ్ల నుంచి బొద్దుగా ఉన్న ఈ అమ్మడు ఎప్పుడూ తిండి కట్టేయలేదు. అవసరం మేర డైట్ పాటించి తన పాత్రకు తగ్గట్టు రూపాన్ని మలుచుకునేందుకు రాశీ ఎప్పుడూ తపించింది. అలాగని తిండిని తగ్గించలేదు. ఫ్లూటుగా తిని దిట్టంగా తయారవ్వడం అనే అలవాటు తనకు ఉన్నా దానికి తగ్గట్టు కసరత్తులతో ప్రతిదీ బ్యాలెన్స్ చేస్తోంది.



ఇటీవలి కాలంలో అందం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం రాశీఖన్నా చాలా శ్రమిస్తోంది. రాజ్ అండ్ డీకే 'ఫర్జీ' లాంటి సిరీస్ తో రాశీ కి బిగ్ బ్రేకిచ్చారు. రాశీ పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. ఆ తర్వాతా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇలాంటి సమయంలో తన కెరీర్ కి ఎలాంటి డిస్ట్రబెన్స్ ని కోరుకోవడం లేదు. అందుకు తగ్గట్టే జిమ్ముల్లో నిరంతరం కసరత్తులు చేస్తూ శరీరాకృతిని అదుపులో ఉంచుతోంది. అయితే అన్నివేళలా తిండి కట్టేయాల్సిన పని లేదు. ఇదిగో ఇలా అందంగా అబగా పిజ్జాలు బర్గర్లు కూడా తినొచ్చని రాశీ చెప్పకనే చెబుతోంది. ఒక రకంగా యూత్ ని టెంప్ట్ చేస్తూ నోరూరించేస్తోంది. అయితే ఈ ఫోటోగ్రాఫ్ ని బాగా పరిశీలిస్తే... రాశి సొగసైన బాత్ రోబ్ ధరించి రుచికరమైన పిజ్జా తింటూ కనిపిస్తోంది. చిరు తిళ్లు కూడా గ్లామర్ కలయిక తో సొగసుగా ఉండాలని రాశీ కోరుకుంటోందా? ఎంతో మోడ్రన్ గా కనిపిస్తున్న ఈ బ్యూటీ యూత్ ని టెంప్ట్ చేసే పన్నాగం పన్నిందని అర్థమవుతోంది. అయినా పిజ్జా తింటే సరే కానీ.. మరీ ఇంతగా హొయలు పోవాలా? అంటూ కొందరు అభిమానులు రాశీని ప్రశ్నిస్తున్నారు.

# రూ.13 కోట్లతో వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన స్టార్ కిడ్

టాలీవుడ్ స్టార్స్ లో చాలా మందికి వ్యవసాయ భూములు.. కమర్షియల్ కాంప్లెక్స్ లు మరియు ఫామ్ హౌస్ లు ఉంటాయి. బాలీవుడ్ సెలబ్రెటీలు మాత్రం ఎక్కువ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతారు. అలాగే రియల్ ఎస్టేట్స్ లో పెట్టుబడులు పెడుతారు. అంతే తప్ప వ్యవసాయ భూముల పై పెట్టుబడి పెట్టడం తక్కువ. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ కి ఫామ్ హౌస్ ఉంటుంది. అందులోనే ఆయన ఎక్కువ సమయం గడుపుతూ ఉంటాడు అంటారు. అక్కడ వ్యవసాయం చేస్తూ ఉన్న ఫోటోలు మరియు వీడియోలు కూడా సోషల్ మీడియా లో అప్పుడప్పుడు చూశాం. ఇప్పుడు షారుఖ్ ఖాన్ కూతురు కూడా వ్యవసాయ భూమి కొనుగోలు చేసింది. మహారాష్ట్ర



రాయ్ గడ్ జిల్లా లోని తీర ప్రాంత పట్టణం అయిన అలీబాగ్ ప్రాంతం లో దాదాపుగా 13 కోట్ల రూపాయలు పెట్టి షారుఖ్ ఖాన్ కూతురు సుహాన ఖాన్ వ్యవసాయ భూమి ని కొనుగోలు చేసిందని బాలీవుడ్ మీడియా సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది. సుహాన ఖాన్ కు వ్యవసాయం అంటే ఆసక్తి ఉండటం వల్లే షారుఖ్ స్వయంగా ఆమె పేరు మీద ఈ వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు షారుఖ్ కాంపౌండ్ నుండి ఈ విషయమై ఎలాంటి అప్డేట్ లేదు. కానీ సుహాన ఖాన్ వ్యవసాయ భూమి కొనుగోలు చేసింది నిజం అంటూ బాలీవుడ్ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు.




# 2024 సమ్మర్..ఆ నలుగురిది సమరమే!




2023 సమ్మర్ కాస్త చప్పగానే సాగింది. రెండు..మూడు సినిమాలు మినహా బాక్సాఫీస్ ని షేక్ చేసిన స్ట్రెయిట్ సినిమాలేతే లేవు. బరిలో స్టార్ హీరోలు కూడా లేకపోవడంతో! సమ్మర్ అంత కిక్ ఇవ్వలేదన చెప్పాలి. మాలీవుడ్ కంటెంట్ టాలీవుడ్ ని ఏలిందనొచ్చు. ఇక తదుపరి లైనప్ జులై నుంచి దసరా వరకూ కొన్ని సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అటుపై క్రిస్మస్..సంక్రాంతి టార్గెట్ గా మరికొన్ని చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇక 2024 సమ్మర్ మాత్రం రసవత్తరంగానే కనిపిస్తుంది. అగ్ర హీరోలంతా క్యూలో కనిపిస్తున్నారు.ఓ సారి వాటి లైనప్ చూస్తే.. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య 'దేవర' తెరెక్కుతోన్న సంగతి తెలిసిందే. నవంబర్ లోగా షూటింగ్ పూర్తిచేసి ప్రకటించిన ఏప్రిల్ 5వతేదీకే రిలీజ్ చేయాలని ముందుకు కదులుతున్నారు. పక్కా ఆ తేదికి ప్రేక్షకుల ముందుకొచ్చేస్తుంది. ఇక పాన్ ఇండియా చిత్రం పుష్ప-2 కూడా సమ్మర్ బరిలోనే దిగే అవకాశం ఉంది. సంక్రాంతి రిలీజ్ అనుకుంటున్నారు గానీ వీలుపడదు. అప్పుడు ప్రత్యేకంగా కొన్ని సినిమాలు రిలీజ్ అవుతాయి. వీటితో పాటు అనువాద సినిమాలు ఎక్కువగానే ఉంటాయి. 'పుష్ప-2' పాన్ ఇండియా రిలీజ్ కాబట్టి పోటీలేని సమయాన్ని చూసుకుని రిలీజ్ చేయాలి. ఆ లెక్కలో సినిమా సమ్మర్ లోనే వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ -శంకర్ కాంబినేషన్ లో రూపొందుతున్న'గేమ్ ఛేంజర్' కూడా సమ్మర్ కే ఫిక్సై అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే షూటింగ్ క్లైమాక్స్ కి చేరింది. ఈ చిత్రం రిలీజ్ కూడా వేసవి అయితే అనుకూలంగా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. ఇక సూపర్ స్టార్ మహేష్ 28వ చిత్రం కూడా సమ్మర్నే టార్గెట్ చేసినట్లు వినిపిస్తుంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూటింగ్ ఇదే ఏడాది పూర్తిచేయాలన్నది ముందు ప్లాన్. కానీ ఇప్పుడా ప్లాన్ మారినట్లు సమాచారం. షూటింగ్ పూర్తిచేయడానికే మరో ఆరునెలలు సమయం పడుతుందిట. ఆ లెక్కన పోస్ట్ ప్రొడక్షన్ పూర్తవ్వడానికి రెండు నెలలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఈసినిమా కూడా వేసవిలోనే రిలీజ్ అవుతుందని ఊహాగానాలు వస్తున్నాయి.

# గాయకుడితో ప్రేమలో శ్రీదేవి చిన్న కూతురు?





శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ఎన్టీఆర్ సరసన భారీ చిత్రంతో టాలీవుడ్ లో అడుగుపెడుతోంది. అయితే కెరీర్ పరంగా ఇంత బిజీగా ఉన్నా కానీ మరోవైపు జాన్వీ కపూర్ ఎఫైర్స్ గురించి నిరంతరం ఏవో కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ జాన్వీ పూర్తిగా కెరీర్ పైనే దృష్టి సారించింది. ఫస్ట్ క్రష్.. ప్రేమాయణాలు ఎన్ని ఉన్నా కెరీర్ కంటే అవేవీ ముఖ్యం కాదని జాన్వీ కపూర్ ఎంతో పరిణతితో ముందుకు సాగుతోంది. అయితే ఇప్పుడు శ్రీదేవి రెండో కుమార్తె ఖుషీ కపూర్ ప్రేమాయణంపైనా ఆసక్తికర గాసిప్ వైరల్ అవుతోంది. నిజానికి ఖుషీ సినీఎంట్రీకి వేళాయింది. జోయా అఖ్తర్ ది ఆర్చీస్ వెబ్ సిరీస్ తో ఖుషీ నటిగా ఆరంగేట్రం చేస్తోంది. షారూఖ్ కుమార్తె సుహానా ఖాన్ - అమితాబ్ మనవడు అగస్త్య నందా సహా ఇతర నటీనటులు నటించిన ది ఆర్చీస్ తో బాలీవుడ్ అరంగేట్రం కోసం సిద్ధంగా ఉన్న ఖుషీ కపూర్ పై ఇంతలోనే ఎఫైర్ కథనాలు వేడెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ కెనడియన్ సింగర్ %ూా% ధిల్లాన్ తో ప్రేమలో ఉందని ప్రచారం ఊపందుకుంది. ఎపి ధిల్లాన్ 'ట్రూ స్టోరీస్....' పాట సాహిత్యంలో ఖుషీ పేరు వినిపించినప్పటి నుండి ఆ ఇరువురి నడుమా రిలేషన్ షిప్ పుకార్లు పుట్టుకొచ్చాయి. ఈ తాజా లింక్ -అప్ పుకారుతో అభిమానులు చాలా థ్రిల్ కి గురయ్యారు. అయితే నెటిజనులు ఖుషీపై అసహ్యకరమైన వ్యాఖ్యలు చేయడం విచారకరం. ఆర్చీస్ ఫస్ట్ లుక్ బయటకు వచ్చినప్పటి నుండి ఖుషీ గురించి బోలెడన్ని వ్యాఖ్యలు వినిపించాయి. AP ధిల్లాన్ తన పాట సాహిత్యంలో ఖుషీ పేరును ఎలా ఉపయోగించాడు? అంటే.. నవ్వితే మీరు ఖుషీ కపూర్ లాగా కనిపిస్తారని ఈ పాటలో అతడు ఒక పదం ఉపయోగించాడు. "జాదోన్ హస్సే తన్ లగే తు ఖుషీ కపూర్".. నువ్వు నవ్వినప్పుడు ఖుషీ కపూర్ లాగా కనిపిస్తావు ! అనే పదాన్ని థిల్లాన్ ఉపయోగించాడు. నిజానికి ఈ పోలికను అతడు పాటలో చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. దీంతో ఖుషీ AP ధిల్లాన్ తో డేటింగ్ చేస్తోందంటూ ప్రచారం దావానలంలా వ్యాపించింది. ఇప్పటివరకూ దీనిపై ఖుషీ స్పందించలేదు. తన నుంచి స్పందన ఎలా ఉంటుందో చూడాలంటూ అభిమానులు చాలా హుషారుగా ఉన్నా కానీ అట్నుంచి స్పందన లేదు. ఈ జంట లవ్ పుకారుపై స్పందిస్తూ ఒక నెటిజన్ ఇలా వ్యాఖ్యానించారు. హద్ హెచ్ ఏసా భీ క్యా హోస్ దేతీ హెచ్ వో ...వైసే వో ఖుషీ కపూర్ భీ బిల్కుల్ అచే న్హీ లగ్తీ హస్తే హ్యూ ....చూసా హువా ఆమ్ లగ్తీ హ్ ....ఉస్మే.భీ దాంట్ బహార్ నిక్లే హ్యూ...అని వ్యాఖ్యానించాడు. నేపో కిడ్స్ కి ప్రమోషన్ చేయడం కోసం BCZ వారి చిత్రం వస్తోంది" అని మరొకరు వ్యాఖ్యానించారు. ఖుషీ కపూర్ కపూర్ అంటే ఇంట్లో ఎంతో గారాభం. తండ్రి బోనీ కపూర్ .. సోదరి జాన్వీ కపూర్ తనని ఒక పెట్ కంటే ఎక్కువగా రక్షించుకుంటారు. ఖుషీ నటిగా మారినందుకు జాన్వి ప్రతిసారీ మాట ల్లో ఉబ్బితబ్బిబ్బవుతోంది. బోనీ తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఖుషీ నటనపై ఆసక్తిని వ్యక్తం చేసిన తీరు తనను ఆశ్చర్యపరిచిందని జాన్వీ మొదటి చిత్రం 'ధడక్' ప్రచార వేదికపై చూసిన రోజునే ఖుషీ కూడా నటించేందుకు అంగీకరించిందని బోనీ వెల్లడించారు. ది ఆర్చీస్ OTTలో విడుదల కానుంది. బాలీవుడ్ లో ఖుషీ కపూర్ సహా ముగ్గురు స్టార్ కిడ్స్ ఈ సిరీస్ తో పరిచయం అవుతున్నారు.

# చీరందంలో కాజల్ బ్యూటీ కెవ్వుకేక!

చందమామ కాజల్ అగర్వాల్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. పనైపోయిం దన్న ప్రతీ సారి తారా జువ్వలా పైకి లేస్తుంది. తల్లైంది కెరీర్ ముగిసిందని విమర్శలొచ్చినా ఆవేవి అమ్మడి వేగాన్ని ఆపలేకపోయాయి. కాజల్ లైనప్ చూస్తే! నవ నాయికల బిజీని మంచి కనిపిస్తుంది. స్టార్ హీరోల చిత్రాలతో పాటు లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేస్తుంది. తమిళ్..తెలుగు చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతుంది. ఎలాంటి ఛాన్స్ వచ్చినా విడిచిపెట్టడం లేదు. మే హునా అంటూ సైన్ చేసి ముందుకె ళ్లిపోతుంది. అమ్మడి వయసు 40 కి చేరువలో



ఉన్నా! బ్యూటీ విషయంలో ఇంకా కుర్రాళ్లకి నిద్ర పట్టకుండా చేస్తుంది. తాజాగా కాజల్ చీరందంలో ఒదిగిపోయిన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. ఇదిగో ఇక్కడిలా క్రీమ్ కలర్ సారీలో షోల్డర్ లెస్ బ్లౌజ్ లో తనలో బ్యూటీని ఆవిష్కరించింది. చేతికి గాజులు..చెవికి బుట్టలు ధరించి నేచరల్ బ్యూటీని హైలైట్ చేస్తుంది. పెదాలపై అందమైన నవ్వు ముఖంలో గ్లో.. మైమరిపించే ఆ కళ్లు ఒక్కసారిగా 25 ఏళ్ల కాజల్ ఓల్డ్ బ్యూటీలోకి తీసుకెళ్లినట్లు అయింది. చీరలో కొంగొత్తగా కనిపిస్తుంది. సారీలో అమ్మడి మెరుపులు తొలిసారి కానప్పటికీ ఈసారి మాత్రం సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతుంది. ప్రస్తుతం ఈఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. కాజల్ అభిమానులు అమ్మడి అందానికి ఫిదా అవుతున్నారు. తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ప్రసవం తర్వాత కాజల్ ఆ మధ్య కాస్త బొద్దు రూపంలోకి మారిందని విమర్శలొచ్చినా వాటిని వేగంగా తొలగించు కోగలిగింది. హబ్బీ గౌతమ్ కిచ్లూ కూడా కాజల్ కి అన్నిరకాలుగా అండదండలుగా నిలుస్తున్నాడు. వృత్తి పరంగా ఎలాంటి నిబంధలను పెట్టకుం డా పూర్తి స్వేచ్ఛతో పనిచేసుకునే వెసులు బాటు కల్పించడంతోనే అమ్మడు ఇవన్నీ చేయగల్గుతుంది. సినిమాల సంగతి చూస్తే తెలుగులో బాలయ్య సరసన భగంవత్ కేసరిలో నటిస్తోంది. అలాగే సత్యభామ అనే లేడీ ఓరియేంటెడ్ సినిమా చేస్తుంది. సెకెండ్ ఇన్నింగ్స్ లో ఉమెన్ సెంట్రిక్ చిత్రాలతో సత్తా చాటాలన్నది అమ్మడి ప్లాన్. ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు చేసింది గానీ ..ఆరకంగా ఇంకా సక్సెస్ ట్రాక్ లోకి రాలేదు.

# సమంత పై శోభిత అలా.. చైతూని కూడా ఇలా అంది!

శోభితా ధూళిపాళ పరిచయం అవసరం లేదు. ఈ తెలుగమ్మాయి హిందీ పరిశ్రమలో హవా సాగిస్తోంది. అడపాదడపా తెలుగు సినిమాల్లో నటిస్తూనే అటు ఉత్తరాదిన భారీ ఫాలోయింగ్ సంపాదించుకుంది. అయితే ఇటీవల అక్కినేని నాగచైతన్యతో ఎఫైర్ సాగిస్తోందంటూ వరుస కథనాలు రావడం సంచలనమైంది. చైతన్య -శోభిత ఇరువురు తమ సంబంధాన్ని ధృవీకరించలేదు లేదా తిరస్కరించలేదు. ఈ జంట వ్యక్తిగత జీవితాలపై రకరకాల ఊహాగానాలు సాగుతూనే ఉన్నాయి. అయినా వేటికీ శోభిత కానీ చై కానీ స్పందించలేదు. తాజా ఇంటర్వ్యూలో నాగచైతన్య గురించి సమంత గురించి శోభితకు ప్రశ్న ఎదురైంది. శోభిత స్పందిస్తూ ఎంతో హుందాగా ఆ ఇరువురి గురించి మాట్లాడటం ఆసక్తిని కలిగించింది. చిత్ర పరిశ్రమలో సమంత ప్రయాణం ఎంతో గొప్పగా సాగుతోందని శోభిత మెచ్చుకున్నారు. సమంత ఆకట్టుకునే లైనప్ తో కెరీర్ ని



సాగిస్తోందని తాను ఏ ప్రాజెక్ట్ చేసినా హెడ్ లైన్స్ లోకి రాగలిగే విధానం నిజంగా బాగుందని శోభిత ప్రశంసించింది. సామ్ ప్రయాణం అద్భుతంగా ఉందని కొనియాడింది. నాగ చైతన్య గురించి మాట్లాడుతూ-"అతడి స్వభావం మంచిద"ని శోభిత కాంప్లిమెంట్ ఇచ్చింది. అతడు ఎంతో శాంత స్వభావి. ప్రశాంతమైన వ్యక్తి.. చాలా డిగ్నిఫైడ్ గా కనిపిస్తాడు. నేను నిజంగా అభినందిస్తున్నాను.. అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం శోభిత వ్యాఖ్యలు గూగుల్ లో ట్రెండింగ్ లో ఉన్నాయి. అయితే మీడియా అంతా ఎంతో హుందాగా కథనాలు రాయడంపై శోభిత క్రిప్టిక్ పోస్ట్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. శోభిత కెరీర్ మ్యాటర్ కి వస్తే గూఢచారి తర్వాత అడివి శేష్ తో కలిసి మేజర్ చిత్రంలో నటించింది. నటిగా అత్యుత్తమ ప్రదర్శనతో మైమరిపించింది. శోభిత లయన్స్ గోల్డ్ అవార్డ్ ను దక్కించుకుంది. బాలీవుడ్ లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన 'ది నైట్ మేనేజర్'లో ఆదిత్య రాయ్ కపూర్ - అనిల్ కపూర్ లతో కలిసి శోభిత కీలక పాత్రలో నటించింది. రీమేక్ లో ఎలిజబెత్ డెబిక్కీ పాత్రను పోషించగా తన పాత్రకు మంచి పేరొచ్చింది. శోభిత ధూళిపాల తదుపరి వరుసగా వెబ్ సిరీస్ లు సినిమాలతో బిజీగా ఉందని తెలుస్తోంది.




## కాంగ్రెస్ పార్టీ దళితుల మీద ఎక్కడా లేని ప్రేమ ఒలకబోస్తుంది: ఎమ్మెల్సీ కవిత

కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ దళితుల మీద ఎక్కడా లేని ప్రేమ ఒలుకబోస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ మేరకు కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పనులని కాంగ్రెస్ పార్టీ కాపీ కొడుతోందని, కాంగ్రెస్ పార్టీ దళితులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తుందని ఆమె ఆరోపించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని ఎక్కువ రోజులు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిక్లరేషన్ పెట్టి దళితులకు ఏమో చేస్తామనడం భావ దారిద్ర్యం తప్ప మరొకటి కాదని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వచ్చి ఎస్సీ డిక్లరేషన్ చేయడం అర్రస్ పాట పాడినట్టు ఉందని, రాజకీయం కోసం తప్ప దళితుల కోసం చేసేదేమీ లేదని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. ఇన్ని రోజులు పాలించిన కాంగ్రెస్ పార్టీ దళితులకు ఏమి చేసిందని ప్రశ్నించారు.

**హంతకుడే సంతాపం తెలిపినట్టుంది :** రైతుల కోసం బీజేపీ మీటింగ్ పెట్టడం ఆ సభకు, అమిత్ షా రావడం చూస్తుంటే హంతకుడే రైతులకు సంతాపం తెలిపినట్టుందని ఎమ్మెల్సీ కవిత వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దళితుల కోసం పనిచేస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, కర్ణాటకలో ఆర్థిక పరిస్థితిని కుంటి సాకుగా చెప్తూ ఉచిత పథకాలను ఎత్తి వేసిందని అన్నారు. తెలంగాణలో ప్రారంభించిన రైతు బంధును కాపీ కొట్టిన మోడీ ప్రభుత్వం తొలుత 13 కోట్ల మందికి రైతు బంధు ప్రారంభించి ఇప్పుడే 2.5 కోట్ల మందికే ఇస్తున్నారన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అందరికీ ఇస్తున్నామన్నారు. బీజేపీ మోటర్లకి మీటర్లని పెట్టాలని చూస్తుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు లేరని కవిత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్ పునరుద్ఘాటించారు. షబ్బీర్ అలీని గంప గోవర్ధన్ నాలుగు సార్లు ఓడించారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కామారెడ్డిలో కేసిఆర్ పోటీ చేస్తారని అన్నారు.

# కేసీఆర్ ఖేల్ ఖతం - బీఆర్ఎస్ దుఖాన్ బంద్



హైదరాబాద్: తాజాగా విడుదల చేసిన దళిత డిక్లరేషన్‌పై అధికార పక్షం చేస్తున్న విమర్శలకు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తమ డిక్లరేషన్ దళితుడిని సీఎం చేస్తానని మోసగించడం లాంటిది కాదని.. గిరిజన జీవితాలలో గుణాత్మక మార్పునకు కన్ఫర్మేషన్ అని రేవంత్ తెలిపారు.

"మా డిక్లరేషన్ దళిత – గిరిజన జీవితాలలో గుణాత్మక మార్పునకు కన్ఫర్మేషన్. 1. మా డిక్లరేషన్ దళితుడ్ని సీఎం చేస్తానని మోసం చేయడం లాంటిది కాదు. 2. మా డిక్లరేషన్%ౌా% ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తానని మోసం చేయడం లాంటిది కాదు. 3. మా డిక్లరేషన్ గిరిజన రిజర్వేషన్లు 12 శాతం చొప్పున పెంచుతానని మోసం చేయడం లాంటిది కాదు. 4. మా డిక్లరేషన్ మద్దతు ధర అడిగిన గిరిజన రైతులను బందిపోట్ల కంటే ఘోరంగా బేడీలు వేసి అవమానించడం లాంటిది కాదు. 5. మా డిక్లరేషన్ నేరెళ్ళ ఇసుక దోపిడీని ప్రశ్నించిన దళిత – బీసీ బిడ్డల పై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం లాంటిది కాదు. 6. మా డిక్లరేషన్ దళిత – గిరిజనులకు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన అసైన్డ్ భూములను లాక్కుని రియల్ ఎస్టేట్ మాఫియాకు అమ్ముకోవడం లాంటిది కాదు. 7. మా డిక్లరేషన్ దళిత మహిళ మరియమ్మను లాకప్ డెత్ చేయించడం లాంటిది కాదు. 8. మా డిక్లరేషన్ ఒకే కుటుంబంలో ముగ్గురు మంత్రి పదవులు తీసుకుని ఒక్క మాదిగకు కూడా మంత్రి పదవి ఇవ్వకపోవడం లాంటిది కాదు. 9. మా డిక్లరేషన్ ఎబిసిడి వర్గీకరణ చేయకుండా మోసం చేయడం లాంటిది కాదు. 10. మా డిక్లరేషన్ దళితబంధు పథకంలో 30 శాతం కమీషన్లకు కక్కుర్తిపడే రాబందుల లాంటిది కాదు. అందుకే యావత్ తెలంగాణ గుండె చప్పుడు ఒక్కటే" అన్నారు.

ఫైనల్‌గా "కేసీఆర్ ఖేల్ ఖతం – బీఆర్ఎస్ దుఖాన్ బంద్" అనే నినాదాన్ని ఇచ్చారు.

# అది డిక్లరేషన్ సభ కాదు.. కాంగ్రెస్ ఫ్రస్ట్రేషన్ సభ



హైదరాబాద్: చేవెళ్ల ప్రజాగర్జన సభలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించడంపై మంత్రి కేసీఆర్ విమర్శలు గుప్పించారు. అది డిక్లరేషన్ సభ కాదని.. కాంగ్రెస్ ఫ్రస్ట్రేషన్ సభ అంటూ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్ల తరువాత కూడా ఎస్సీల, ఎస్టీలు వెనకబడి ఉన్నారంటే అందుకు ప్రధాన దోషి కాంగ్రెస్ పార్టీ అంటూ విరుచుకుపడ్డారు. మంత్రి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..."అది డిక్లరేషన్ సభ కాదు...అధికారం రానే రాదనే... కాంగ్రెస్ ఫ్రస్ట్రేషన్ సభ. కర్ణాటకలో కనీసం రేషన్.. ఇవ్వలేని కాంగ్రెస్. తెలంగాణకొచ్చి డిక్లరేషన్.. ఇస్తే నమ్మేదెవరు ?. గాడ్సేనే గెలుస్తాడన్న గ్యారెంటీ లేదు. మీ 12 గ్యారెంటీలకు విలువ ఎక్కడిది. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ ప్రజలకు తెలుసు.. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరిట.. విజన్ లేని కాంగ్రెస్.. డజన్ హామీలు.. గాలిలో దీపాలే. స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్ల తరువాత కూడా ఎస్సీలు, ఎస్టీలు వెనకబడి ఉన్నారంటే దానికి కారణం, ప్రధాన దోషి కాంగ్రెస్ పార్టీ.

దళిత, గిరిజన బిడ్డలకు కాంగ్రెస్ చేసిన దశాబ్దాల పాపమే ఆ పార్టీని మరో వందేళ్లయినా శాపంలా వెంటాడుతూనే ఉంటుంది. కర్ణాటకలో నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి పాలించే ఎబిలిటీ లేదు. ప్రజల్లోక్రెడిబిలిటీ లేదు. తెలంగాణ రాష్ట్రం అంటేనే దేశానికే ఓ పరిపాలనా పాఠం. ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చని పార్టీ మీది. ఇవ్వని హామీలెన్నో అమలు చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీది. తెలంగాణలో బీజేపీకి చరిత్ర లేదు. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదు.. చరిత్ర, భవిష్యత్తు ఉన్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే" అంటూ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

## మాకు నూకలు చెల్లడం కాదు.. రాబోయే ఎన్నికల్లో మీరు మాజీలే.. అమిత్‌షాకు హరీష్‌రావు కౌంటర్



హైదరాబాద్: తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయి.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సర్కార్ ఏర్పడటం ఖాయమంటూ ఖమ్మం సభలో కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై మంత్రి హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. మంత్రి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "మాకు నూకలు చెల్లడం కాదు.. తెలంగాణ ప్రజలు నూకలు తినాలని మీ మంత్రి పియూష్ గోయల్ వెక్కిరించినప్పుడే బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లిపోయాయి. బ్యాట్ సరిగా పట్టడం చేతకాని మీ అబ్బాయికి ఏకంగా బీసీసీఐలో కీలక పదవి ఎలా వరించిందో అందరికీ తెలుసు. అలాంటిది మీరు కుటుంబ పాలన గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది.

పెద్ద ఎత్తున రైతులు ఉద్యమిస్తే కార్పొరేట్ కొమ్ముకాసే చట్టాలను ఉపసంహరించుకుని తోకముడిచిన మీరా.. రైతు బాంధవుడైన కేసీఆర్‌ను విమర్శించేది. 2జీ 3జీ 4జీ కాదు, కేంద్రంలో దశాబ్ద కాలంగా నాజీలను మించిన నియంతృత్వ పాలన మీది. రాబోయే ఎన్నికల్లో మీరు మాజీ లే. సీఎం పదవి కాదు.. ముందు తెలంగాణలో సింగిల్ డిజిట్ తెచ్చుకునేందుకు ప్రయత్నించండి. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజీ లేని యోధుడు కేసీఆర్ గారు. అబద్ధపు విమర్శలు.. అవుట్ డేటెడ్ ఆరోపణలు.. రాసిచ్చిన స్క్రిప్ట్‌తో హోం మంత్రి స్కిట్" అంటూ మంత్రి హరీష్‌రావు ట్వీట్ చేశారు.

## అందుకోసమే భాజపా-శివసేన ప్రభుత్వంలో చేరా: అజిత్ పవార్



ముంబయి: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే శివసేన (ఏక్‌నాథ్ శిందే వర్గం)– భాజపా ప్రభుత్వంలో చేరినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బారామతి నియోజకవర్గంలో పర్యటించిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. "ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్రాభివృద్ధి కోసమే భాజపా–శివసేన ప్రభుత్వంలో చేరాను. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు. దేశాభివృద్ధి కోసం ప్రధాని మోదీ ఎంతో కష్టపడుతున్నారు. గతంలో నేను ఆయన్ను విమర్శించాను. కానీ, ప్రధాని చేస్తున్న అభివృద్ధి పనులు చూసి అందులో భాగస్వామ్యం కావాలని భాజపా–శివసేన ప్రభుత్వంలో చేరాను. 2004లో కూడా ఎన్సీపీ అభ్యర్థికి సీఎం అయ్యే అవకాశం లభించింది. కానీ, ఎన్సీపీ ఆ పదవిని కోరుకోలేదు" అని అజిత్ పవార్ తెలిపారు. ఇటీవల ఎన్సీపీ అధినేత శరద్ పవార్ మాట్లాడుతూ.. తమ పార్టీలో ఎలాంటి చీలిక లేదని వ్యాఖ్యానించారు. మెజార్టీ సభ్యులేమీ బయటకు వెళ్లిపోలేదని, కేవలం కొందరు వ్యక్తులు భిన్నమైన వైఖరి తీసుకున్నారని, ఇదేం చీలిక కాదని అన్నారు. మరోవైపు అజిత్ భాజపా–శివసేన ప్రభుత్వంలో చేరినప్పటికీ.. ఆయన తన బాబాయ్‌తో వరుసగా సమావేశం అవుతున్నారు. దీంతో శరద్‌పవార్ భాజపాతో జట్టు కడతారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, వాటిని శరద్ పవార్ కొట్టిపారేస్తున్నారు.




# మైనంపల్లిపై వేటుకు రంగం సిద్ధం?

హైదరాబాద్ : బీఆర్ఎస్ తొలి జాబితా విడుదలకు ముందే తన కుమారుడికి సైతం టికెట్ కేటాయించాల్సిందే.. లేకుంటే తానేంటో చూపిస్తానన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై వేటుకు రంగం సిద్ధమైంది. తన కుమారుడికి టికెట్ కేటాయించాలని అడగటం వరకూ సబబే కానీ మంత్రి హరీష్‌రావుపై ఆయన చేసిన వ్యాఖ్యలు మరీ దారుణం. దీనిపై వెంటనే మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత స్పందించారు. అలాగే మైనంపల్లిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనలకు దిగారు. దీంతో మైనంపల్లిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తున్నట్టు సమాచారం. మల్కాజ్‌గిరి అభ్యర్థిని మార్చాలని సైతం బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి హరీశ్ రావు తో శంభీపూర్ రాజు భేటి అయ్యారు. 4 పెండింగ్ సీట్లతో పాటు మల్కాజిగిరికి ఒకట్రెండు రోజుల్లో అభ్యర్థుల ప్రకటన ఉండే అవకాశం ఉంది. జనగామ – పల్లా రాజేశ్వర్ రెడ్డి, నర్సాపూర్ – సునీత లక్ష్మారెడ్డి, నాంపల్లి – ఆనంద్ గౌడ్, గోషామహల్ – నందకిషోర్ వ్యాస్‌లను బీఆర్ఎస్ పార్టీ ప్రకటించే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ వాళ్లను కాల్చి పడేస్తా: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



హైదరాబాద్: కాంగ్రెస్‌పై నాగర్‌కర్నూల్‌కు చెందిన భారాస ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాళ్లను కాల్చి పడేస్తానని ఆయన వ్యాఖ్యానించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తెల్కపల్లి మండలంలో 'పదేళ్ల ప్రజా ప్రస్థానంలో మర్రన్న' పాదయాత్ర సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడారు.

"నా జోలికి వస్తే ఒక్కొక్కరిని కాల్చి పడేస్తా. కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో తిరగకుండా చేస్తాను. నేను తలుచుకుంటే కాంగ్రెస్ చేయి ఊడిపోతుంది" అని మర్రి జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణకు బీఆర్ఎస్ నాయకత్వమే శ్రీరామ రక్ష: మంత్రి వేముల



నిజామాబాద్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కాంగ్రెస్, బీజేపీ నేతలకు కనిపించడం లేదా అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని చెప్పారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో బీసీ కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వంలో కూడా బీడీ కార్మికులకు పెన్షన్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ దవాఖానలకు బలోపేతం చేశామని తెలిపారు. సీఎం కేసీఆర్ సంపద సృష్టించి పేదలకు పంచుతున్నారని వెల్లడించారు. తెలంగాణకు బీఆర్ఎస్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్ని చెప్పారు.

# కవిత మీ కుటుంబంతో కర్ణాటకకు రండి



కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ చెప్పినది చేస్తోందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ ఇస్తేనే... తమరు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ మహారాష్ట్రకు ఎందుకు వెళ్తున్నారో.. రాష్ట్ర సంపదను మహారాష్ట్రలో ఎందుకు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. దళితులు గురించే మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. "కర్ణాటకలో బీఆర్ఎస్ పార్టీ ఉంది కదా... మీ నాయకులను అడగండి కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో. కవిత మీ కుటుంబంతో కర్ణాటకకు రండి... ప్రజాదర్బార్ నిర్వహిద్దాం" అని అన్నారు. మంత్రులకే అపాయిట్‌మెంట్ ఇవ్వాని కేసీఆర్ కామారెడ్డికి వచ్చి ఏం చేస్తారని నిలదీశారు. 50 సంవత్సరాలు తెలంగాణ కావాలని పోరాడిన బిడ్డ గద్దర్‌కు కేసీఆర్ ఒక్కసారి కూడా ప్రగతి భవన్‌కు రానివ్వలేదన్నారు. అమిత్ షా పచ్చి అబద్దాల మనిషి అని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఒక్కటి కాదు అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అలైబలై చేసుకుని ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ముదిరాజ్ సోదారులకు కులవృత్తి లేదని... అలాంటి వారికి ఒక్క ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేదని షబ్బీర్ అలీ వ్యాఖ్యలు చేశారు.

# టి-9 టికెట్లను నిలిపివేసిన టీఎస్ఆర్టీసీ... ఎందుకంటే?




హైదరాబాద్: పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణికుల కోసం జారీ చేసే టి–9 టికెట్లను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ప్రకటించింది. రాఖీ పౌర్ణమికి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా టి – 9 టికెట్లను తాత్కాలికగా నిలిపివేస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ వెల్లడిచింది. రేపటి (మంగళవారం) నుంచి నాలుగు రోజుల పాటు నిలుపుదల అమల్లో ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 2 నుంచి ఈ టికెట్లు యధాతథంగా కొనసాగుతాయని ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణికులకు టి–9 పేరుతో రెండు టికెట్లను సంస్థ జారీ చేస్తోంది. 60 కిలో మీటర్ల పరిధిలో రానుపోను ప్రయాణానికి టి–9–60ని, 30 కిలో మీటర్ల టి–9–30ని అందుబాటులోకి తీసుకువచ్చింది. టి–9–60 టికెట్‌ను రూ.100కు, టి–9–30ని రూ.50కి ప్రయాణికులకు అందజేస్తోంది.

**అందుకే టికెట్‌ను నిలిపివేస్తున్నాం...** అయితే ఈ టి–9 టికెట్‌ను రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. "రాఖీ పౌర్ణమికి బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో టి–9 టికెట్లను మంజూరు చేయడం సిబ్బందికి కష్టం. టికెట్ల జారీకి ప్రయాణికుడి జెండర్, వయసు, తదితర వివరాలను టిమ్ మిషన్లలో నమోదు చేయాల్సి ఉంటుంది. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు అందుకు చాలా సమయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే టి–9 టికెట్లను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సంస్థ నిర్ణయించింది. రేపటి నుంచి సెప్టెంబర్ 1 వరకు నాలుగు రోజుల పాటు ఈ నిలుపుదల అమల్లో ఉంటుంది. సెప్టెంబర్ 2 నుంచి యథాతథంగా ఈ టి–9 టికెట్లు కొనసాగుతాయి." అని టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ వెల్లడించారు.

# మరోసారి సహనం కోల్పోయిన తలసాని



హైదరాబాద్ : రాజకీయాల్లో ముఖ్యంగా కావల్సింది సహనం. ఎంత సహనం ఉంటే అంతలా రాణిస్తారు. కానీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎందుకో గానీ ఈ మధ్య పదే పదే సహనం కోల్పోతున్నారు. మొన్నటికి మొన్న స్టీల్ వంతెన ప్రారంభోత్సవం సందర్భంగా ఓ వ్యక్తిని తోసేసి ఓ వర్గం ఆగ్రహానికి గురయ్యారు. ఆ తరువాత క్షమాపణలు చెప్పారు. తాజాగా మరోసారి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహనం కోల్పోయారు. భాగ్యనగర్ గణేష్ సమితి సెక్రెటరీ పై మండిపడ్డారు.ఓల్డ్ సిటీలో మ్యాన్ హోల్స్, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వివరిస్తున్న సెక్రటరీ పై తలసాని అసహనం వ్యక్తం చేశారు. గత బోనాలల్లో సరైన ఏర్పాట్లు లేక మ్యాన్ హోల్స్ లో పడి భక్తులకు గాయాల పాలయ్యారంటు చెపుతున్న ఉత్సవ నిర్వహాకులపై సైతం మండిపడ్డారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com